# ఆగ్నేయ న్యూస్

VOICE OF DEMOCRACY

తెలుగు దినపత్రిక

సంపుటి :18 సంచిక :216 ఖమ్మం, తెలంగాణ శనివారం 12.09.2026 పేజీలు :12, వెల : 2/-

Circulating to : Hyderabad, Khammam, Warangal, Nalgonda, Karimnagar, Adilabad, Medak and Mahabubnagar




నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు 11

# తెలంగాణ కులగణన సర్వే దేశానికే ఆదర్శం



### జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలి

### కులగణన చేద్దామా? వద్దా? బీజేపీ సూటిగా చెప్పాలి

కులగణనతోనే బలహీన వర్గాలకు న్యాయం..

దేశ సంపద సమాన పంపిణీకి మార్గం

తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా సర్వే చేయాలి

వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు

అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే ను దేశానికి ఆదర్శంగా తీసుకుని, దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో జనగణన, కులగణన అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. కులగణన అనేది కులాలకు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను సరిచేయాలంటే ముందుగా వాటి తీవ్రతను, స్వభావాన్ని తెలుసుకోవాల్సి ఉంటుందని, అందుకు కులగణన ఎంతో కీలకమని అన్నారు.**

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఏ కులానికి ఎంత జనాభా ఉంది, వారి వృత్తులు ఏమిటి, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది, ఎంతమంది చదువుకున్నారు, ఎంతమంది ఉద్యోగాల్లో ఉన్నారు, ఎంతమంది నిరుద్యోగులు, భూమి ఉన్నవారు ఎంతమంది, లేనివారు ఎంతమంది వంటి అనేక అంశాలను కూలంకషంగా సేకరించామని చెప్పారు. ప్లానింగ్ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎంగా తాను ప్రతిరోజూ ఈ ప్రక్రియను సమీక్షిస్తూ, ఎలాంటి పొరపాట్లకు

-మిగతా 2 లో..



# పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరించం

### అవసరమైతే జీవో 97ని సవరిస్తాం

విద్యార్థుల బాగు కోసమే విద్యా విధానంలో సంస్కరణలు

కేసీఆర్ విజిలెన్స్ నివేదికను అడ్డంపెట్టుకొని.. ఫిరాయింపులను ప్రోత్సహించారు

వారికి అనుకూలంగా ఉన్న కాలేజీలకే ఫీజు రీయింబర్స్‌మెంట్

మా ప్రభుత్వంలో నిజాయతీగా ఉన్న కాలేజీలకే రీయింబర్స్‌మెంట్

అసెంబ్లీలో విద్యపై విస్తృతస్థాయి చర్చలో సీఎం స్పష్టీకరణ

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ప్రయోగం విజయవంతం కావడంతో.. అదే విధానాన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ అవలంబించాలని నిర్ణయించాం. కానీ కొందరు వారి రాజకీయ ప్రయోజనాల కోసం అనవసర రాద్ధాంతం చేసి.. విద్యార్థులను, లెక్చరర్లను రెచ్చగొడుతున్నారు. వారి రాజకీయ ప్రయోజనాల వైపు వెళ్తే పిల్లలు శాశ్వతంగా నష్టపోతారు. కడుపులో విషం పెట్టుకొని ఆ కుటుంబం తిరుగుతోంది. భూములను అమ్ముకుంటారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ మా ప్రభుత్వం ఏటీసీలకు 282 ఎకరాల రెవెన్యూ భూములను బదిలీ చేసింది. ఒక్కో ఏటీసీ కట్టడానికి రూ.46 కోట్లు వెచ్చిస్తున్నాం. పిల్లలను బాగు చేయడానికి మేము ప్రయత్నిస్తుంటే. వారు తప్పుడు

-మిగతా 2 లో..



# పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

### అందుకు బిజెపిపై దాడులకు తెగిస్తున్నారు

బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోదీ

**బ్రిక్స్ కూటమి 18వ శిఖరాగ్ర సదస్సులో భాగంగా మూడు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఢిల్లీలోని భారత మండపంలో జరిగిన ఈ సమావేశంలో ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా కీలకమైన రక్షణ ఒప్పందాలపై సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. 2030 నాటికి ఇరుదేశాల మధ్య 100 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యంగా చర్చలు కొనసాగినట్లు సమాచారం.**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 :రాజకీయ, ఆర్థిక, రక్షణ, ఇంధనం, అంతరిక్షం, ప్రజల మధ్య సంబంధాలకి సంబంధించిన రంగాల్లో ద్వైపాక్షిక సహకార పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ సంక్షోభాన్ని మోదీ ప్రస్తావించినట్లు సమాచారం. చర్చలు, దౌత్యమార్గాల ద్వారానే వీటిని పరిష్కరించుకోవాలని ఉద్ఘాటించిన ఆయన.. ఈ సంక్షోభం ముగింపు కోసం జరిగే శాంతి ప్రయత్నాలకు సాయం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని పేర్కొన్నట్లు భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో

-మిగతా 2 లో..

# చెరువుల హద్దులకు రక్షణ కవచం



మత్స్యకారుల బతుకులకు భరోసా

ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణపై రాజీ పడబోం

అన్ని చెరువులకు పరిరక్షణ కమిటీల ఏర్పాటు

ఇప్పటికే 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్

డిసెంబర్ 2027 నాటికి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టుకు జలసిరులు

శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : చెరువు నిండితే పల్లె పచ్చబడుతుందని, మత్స్యకారుడి వల నిండితే అతని కుటుంబంలో వెలుగులు విరుస్తాయని, అందుకే చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణతోపాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని కాపాడటాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. చెరువుల పూర్తి నీటిమట్టం---ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, జలవనరుల ఆక్రమణలను ఉపేక్షించబోమని ఆయన శాసన మండలి వేదికగా ప్రకటించారు. శుక్రవారం శాసన మండలిలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సమాధానమిచ్చారు. చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, జలవనరులు

-మిగతా 2 లో..



### 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి మోదీ

సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి

అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్

-మిగతా 2 లో..

# పరాకాష్ఠకు చేరిన భూ దందాలు

### రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు

రేవంత్ అధికారంలోకి వచ్చాక పెరిగిన దందాలు

గాంధీల పేరు చెప్పుకుని ఏలుతున్న గజదొంగలు

సీఎం రేవంత్‌పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

22ఏ జాబితా అనేది దురుద్దేశంతో చేసిన దుర్మార్గం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

తెలంగాణ భవన్‌లో 22ఏ భూ బాధితులతో సమావేశం





హైదారాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు అన్న రీతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెట్టాపట్టాల్‌వేసుకుని రాష్ట్రాన్ని దోచేసుకుంటున్నారని ఆరోపించారు. కొండల్, తొండల్, అనకొండల్ అంటూ రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి, పొంగులేటి వర్గీయులను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్

-మిగతా 2 లో..



| నేటి చికెన్ ధరలు | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 92 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 119 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 184 (కిలో) |
| స్కిన్ లెస్ | 208 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

### పలువురు ప్రముఖులకు ఈసీ నోటీసులు

**కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన నిమిత్తమే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.**

03






### కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్!

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్

-మిగతా 2 లో..

# తెలంగాణలో అనలాగ్ పనీర్ బంద్

### ఏడాది పాటు నిషేధం.. ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : హోటళ్లు, దాబాలు, రోడ్డు పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పన్నీర్ బట్టర్ మసాలా, పన్నీర్ టిక్కా అంటూ లొట్టలేసుకుని లాగించే భోజనప్రియులకు తెలంగాణ ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. మార్కెట్లో విచ్చలవిడిగా లభిస్తున్న కృత్రిమ, నాన్-డైరీ అనలాగ్ పన్నీర్ దందాపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు ఉక్కుపాదం మోపింది. ప్రజారోగ్యాన్ని తీవ్రంగా ప్రమాదంలో పడేస్తున్న ఈ కృత్రిమ పన్నీర్ తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలపై రాష్ట్రవ్యాప్తంగా

-మిగతా 2 లో..





# పరాకాష్ఠకు చేరిన భూ దందాలు

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారికంగా ఒక రెవెన్యూ వ్యవస్థ ఉంటే.. తెరవెనుక అదృశ్య శక్తులతో కూడిన మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. ఫైళ్లు ఎవరి ఆదేశాల మేరకు కదులుతున్నాయో, అసైన్డ్ భూములు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. లగచర్లలో తమ అల్లుడికి భూములు కట్టబెట్టడానికి గిరిజనుల పొలాలను గుంజుకున్నారని, హైదరాబాద్ చుట్టూ ఉన్న రూ. వేల కోట్ల విలువైన 10 వేల ఎకరాల భూములపై సీఎం రేవంత్ రెడ్డి కన్ను పడిందని విమర్శించారు. మూసీ ముసుగులోనూ, ఫ్యూచర్ సిటీ పేరుతోనూ పెద్ద ఎత్తున రియల్ దందాకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీ తెచ్చి ప్రాంతపు రూపురేఖలు మార్చితే, రేవంత్ రెడ్డి మాత్రం రూ. 200 కోట్ల విలువైన భూమిని తన తమ్ముడికి చెందిన కంపెనీకి కేవలం రూ. 7 కోట్లకే అడ్డికి పావుశేరు లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ. 1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత జాబితా అయిన 22ఏ కింద పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాకముందు రియల్ ఎస్టేట్ రంగానికి ఎలాంటి భరోసా లేదని, కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను తీర్చి భూముల విలువను ఊహించని స్థాయికి తీసుకెళ్లారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు ఎకరం రూ. 5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ. 50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో భూమి కనిపిస్తే బుక్క పెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్ అనే చందంగా దందాలు నడుస్తున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న లీడర్లు గజదొంగల్లా మారారని ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక్ వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, కానీ నేటి కాంగ్రెస్ భూభారతి అవతారంలో భూముల గోల్‌మాల్‌ను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. సెక్షన్ 22ఏ ఆధారంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజల ఆస్తులను గుంజుకుంటున్న ఈ కుంభకోణంపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల తరపున బీఆర్ఎస్ పోరాడుతుందని, ప్రభుత్వం చేస్తున్న ఈ అక్రమాలపై న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన నిషేధిత భూముల జాబితా (22ఏ) వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో ప్రజల భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆయన ఆరోపించారు. . ప్రస్తుత ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనను పూర్తిగా పక్కనపెట్టి, కేవలం భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని హరీశ్ రావు దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై ప్రభుత్వం కన్నేశందని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేస్తే చాలంటూ ప్రచారం చేసుకున్నారని, కానీ బాధితులు నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినా ఎలాంటి న్యాయం జరగడం లేదని విమర్శించారు. మరోవైపు హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం, బడా బాబులు నిర్మించిన భారీ అక్రమ కట్టడాల జోలికి మాత్రం వెళ్లడం లేదని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి నివాసాన్ని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్న వారు, అదే జాబితాలో నానా ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజల భూములు మరియు ఇళ్లను ఎందుకు తొలగించడం లేదని సూటిగా నిలదీశారు. తక్షణమే పేదల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి రాజీలేని పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్!

(మొదటిపేజీ తరువాయి)

మాజీ మంత్రి కొండా సురేఖకు స్వయంగా ఫోన్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం తెలిసింది. ప్రస్తుతం రాష్ట్ర శాసనసభ సమావేశాలు కొనసాగుతున్న తరుణంలో, ఇన్‌ఛార్జ్ నేరుగా ఆమెతో మాట్లాడటం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని, చర్చను రేకెత్తిస్తోంది. ఈ ఫోన్ సంభాషణ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో తలెత్తిన కొన్ని వ్యక్తిగత అంశాలు మరియు అంతర్గత విభేదాలను పూర్తిగా పక్కనపెట్టి, భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాల్లో తిరిగి ఉత్సాహంగా, చురుగ్గా పాల్గొనాలని మీనాక్షి నటరాజన్ ఆమెకు గట్టిగా సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన విషయం విదితమే. ఆ తర్వాత జరుగుతున్న ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలకు ఆమె హాజరుకాకపోవడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జ్ స్వయంగా రంగంలోకి దిగి ఆమెతో మాట్లాడినట్లు తెలుస్తోంది.

## పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

తెలిపింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలోనూ రెండు దేశాలు గణనీయ-ంమైన వృద్ధిని నమోదు చేస్తూ స్థిరత్వాన్ని చూపుతున్నాయని ఇద్దరు నేతలు అభిప్రాయపడ్డారు. ఇరుదేశాల మధ్య ప్రత్యేకాధికార వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేసేందుకు మోదీ, పుతిన్‌లు అంగీకరించారు. భారత్–రష్యా 24వ వార్షిక సదస్సు కోసం మాస్కోకు రావాలని పుతిన్ ఆహ్వానించగా.. ఇందుకు మోదీ అంగీకరించారు. ఇందుకు సంబంధించిన తేదీలను త్వరలో ఖరారు చేయనున్నారు. ఇదిలాఉంటే, ద్వైపాక్షిక భేటీ అనంతరం భారత్ మండపం కాంప్లెక్స్‌లోనే ఏర్పాటు చేసిన బిజినెస్ ఫోరమ్ సమావేశానికి ఇరువురు నేతలు ఒకే కారులో వెళ్లారు.

# పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరించం

(మొదటిపేజీ తరువాయి)

ప్రచారం చేస్తున్నారు. పాలిటెక్నిక్ కాలేజీలను ప్రైవేటీకరించడం పచ్చి అబద్ధం. ఇంతకుముందు ఎలాగుందో భవిష్యత్‌లోనూ అలాగే ఉంటుంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి వస్తే.. సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో సరైన రీతిలో శిక్షణ లభిస్తుంది. ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఈ విషయంలో ఎలాంటి అపోహలున్నా తొలగిస్తాం. అవసరమైతే జీవో 97లో సవరణలు చేస్తాం. ఉద్యోగ భద్రతపై అపోహలొద్దు. స్టాఫ్‌ను కొనసాగిస్తాం. ఫీజుల భారం ఉండదు. ఏమైనా అపోహలుంటే.. కేశవరావు నేతృత్వంలో కమిటీకి వెళ్లి చెప్పండి. టాటా సంస్థ అందిస్తున్న రూ. 4వేల కోట్ల సాయాన్ని మనం తీసుకోకపోతే.. వెనక్కి పోతాయి. 'ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సిన కళాశాలలపై నాడు కేసీఆర్ విజిలెన్స్ విచారణ చేయించారు. కానీ చర్యలు తీసుకోలేదు. ఆ రిపోర్టు ఎక్కడికి పోయిందని నేను వచ్చాక ఆరా తీశా. విచారణకు ఆదేశించా. ఆ రిపోర్టును అడ్డంపెట్టుకొని అప్పట్లో ఆయన పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారు. వాళ్లకు అనుకూలంగా ఉన్న కళాశాలలకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'కేసీఆర్ హయాంలోని మంత్రి కాలేజీలో రూ. 400 కోట్లు వారి ఎకౌంట్‌లో ఉన్నాయి. అవి దోచుకున్న డబ్బులో... లేక విద్యార్థుల నుంచి వసూలు చేసిన డొనేషన్లో? పూలమ్మితే.. పాలమ్మితే అన్ని కోట్లు వస్తాయా.. నాకైతే తెలియదు' అని అన్నారు. శుక్రవారం రాత్రి అసెంబ్లీలో విద్యపై జరిగిన చర్చలో సుమారు 3 గంటలకు పైగా ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ తెచ్చిందే తామని, దాని పేటెంట్ తమదేనని.. దాన్ని రద్దు చేయబోమని స్పష్టం చేశారు.

"ఫీజు రీయింబర్స్‌మెంట్ అప్పు నేను పెట్టలేదు. అది నాకు గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన అప్పు. గత ప్రభుత్వం దిగిపోయేనాటికి రూ. 5,435 కోట్ల బకాయిలు పెట్టింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. గత ప్రభుత్వం పెట్టిన అప్పు రూ. 1,410 కోట్లు చెల్లించింది. మా ప్రభుత్వ బకాయిలు రూ. 1,465 కోట్లు ఇచ్చాం. ఈ విద్యా సంవత్సరంలోనే రూ. 612 కోట్లు చెల్లించాం. ఏడాదికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ. 2,400 కోట్లు అవసరం. ఇప్పుడు డిమాండ్ చేస్తున్న భాజపా నేతలు కేసీఆర్ ఉన్నప్పుడు చేశారా? మేము మాత్రం నిజాయతీగా ఉన్న కాలేజీలకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తాం. అక్రమాలకు పాల్పడే వారికి ఇవ్వబోం. విద్యార్థులు ఫైనల్ ఇయర్‌లో వెళ్లిపోయేటప్పుడు కొన్ని



కళాశాలలు వారి నుంచి ఫీజు తీసుకుంటున్నాయి. మళ్లీ ఆ విద్యార్థుల వివరాలను నమోదు చేసి ప్రభుత్వం నుంచి కూడా రెండోసారి రీయింబర్స్‌మెంట్ పొందుతున్నాయి. మోసం చేసే కాలేజీలపై చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు అత్యుత్తమ విద్యావకాశాలు కల్పించడమే మా లక్ష్యం. ప్రపంచంతో పోటీపడేలా వారిని తీర్చిదిద్దుతున్నాం. సీఎం విద్యాశాఖను చూస్తున్నారంటే అది అత్యంత ప్రాధాన్యం కలిగినదని అర్థం. పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేరని విమర్శిస్తే ఏముంటుంది? విద్యాశాఖ వంటివి సీఎం ఉంచుకుంటే పేదలకు న్యాయం జరుగుతుంది. సీఎం విద్యాశాఖ మంత్రిగా ఉండి కూడా ఈ శాఖ వెనుకబడితే నేను వైఫల్యం చెందినట్టే అవుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యావిధానం మధ్య తెలియని సన్నని తెర నడుస్తోంది. ఒక టీచర్‌కు 30 మంది విద్యార్థులుండాలనేది నిబంధన. కానీ తెలంగాణలో 17 మందికి ఒక టీచర్ ఉన్నారు. నాణ్యమైన విద్య ఇవ్వాలని 10,600 టీచర్ పోస్టులను తక్కువ సమయంలో భర్తీచేశాం. భారాస పాలనలో 7,858 టీచర్ పోస్టులను భర్తీచేశారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా, ఆ తర్వాత పుట్టిన జెన్ బీటా తరాలకు కూడా తెలంగాణ నూతన విద్యావిధానం ఉపయోగపడాలి. ప్రజల సమస్యలపై కొట్లాడటానికి మాకేం మొహమాటం లేదు. మోడల్ స్కూళ్లకు కేంద్రం 2014 నుంచి నిధులివ్వడం మానేసింది. ఒక ఐఏఎస్‌ను బదిలీ చేయడం నాకు పెద్ద సమస్య కాదు. కానీ టీచర్‌ను బదిలీ చేయాలంటేనే కష్టం. 1,603 సహాయ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ నియామక విధానం ఫైల్‌ను కేంద్రం రెండేళ్ల పాటు పెండింగులో పెట్టి ఇటీవల వెనక్కి పంపింది. దానికి వివరణలు ఇచ్చి పంపాం. దానికి ఆమోదం రాగానే అన్నీ ఖాళీలు భర్తీ చేస్తాం. మా హయాంలో తెచ్చిన విద్యా సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గత రెండేళ్లలో 87 వేలు అదనంగా పెరిగింది. సీఎం విద్యాశాఖ మంత్రిగా సరిగా పనిచేయలేదంటే ఎలా? కేంద్రం విద్యలో రాష్ట్రాలకు ఇచ్చే గ్రేడింగ్ సూచికల్లో 31 నుంచి 18 ర్యాంకుకు తెలంగాణ పెరిగింది. అచీవ్‌మెంట్ సర్వేలో 36 నుంచి 26కి వచ్చింది. అత్యంత నిరుపేదలు కూడా కష్టపడి తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు ఎందుకు పంపుతున్నారని అధ్యయనం చేశాం. ప్రైవేటు స్కూళ్లకు రెండున్నరేళ్లకే నర్సరీకి పంపుతుంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరే పేదలు వెనుకబడుతున్నారు. ఈ నేపథ్యంలో పేదలు కూడా తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్నారు. నర్సరీ, ఎల్‌కేజీతో పాటు ఇంగ్లిషు భాషను నేర్చుకోవాలనే తపన పేదలలో ఉంది. అందుకే అక్కడికి పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో 4,100 పైగా పాఠశాలల్లో 64 వేల మంది పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నాం. నర్సరీ నుంచి 12వ తరగతి వరకూ పోషకాహారం అందించాలని బ్రేక్‌ఫాస్ట్, లంచ్ ప్రారంభించా. రేవంతన్నగా పేద పిల్లల పోషకాహారం కోసం ఈ ఏడాది రూ. 927.39 కోట్లు ఖర్చుపెడుతున్నాం. తెలంగాణ నా హక్కు.. పట్టా అంటూ మాట్లాడే ఆయన గుంటూరులో చదివారు. ఆయన చదివిన చదువుకు బంట్రోతు ఉద్యోగం రాదు. అమెరికాకు వెళ్లి అదో ఇదో పని చేసి వచ్చారు. ఆయనకు పేదరికం తెలియదు. నేను ఏనాడూ పేదవాడిని అని చెప్పుకోలేదు. కానీ వారి మధ్యనే పెరిగాను. మా నాన్న పోలీసు పటేల్ అయినా.. అన్ని కులాల వారు మాకు సహాయకారులుగా ఉన్నారు. పేదలపై నాకున్న తాపత్రయం, మానవ సంబంధాలు మీకేం ఉన్నాయి? మీకు నాకు పోలికే లేదు. నన్ను అందరూ అభిమానిస్తారు. మిమ్మల్ని అంతా అసహ్యించుకుంటున్నారు.

# తెలంగాణ కులగణన సర్వే దేశానికే ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

తావులేకుండా సర్వేను నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో నిర్వహించిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం అభినందించారని గుర్తుచేశారు. దేశమంతా తెలంగాణ మోడల్ కావాలి తెలంగాణలో జరిగిన సర్వే తరహాలో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందని భట్టి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్‌లోని వివిధ పార్టీల నాయకులతో పాటు ప్రధానమంత్రిని కూడా కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. మంత్రులు కూడా ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని వివరించారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన విధంగా స్పందన రాకపోవడంతో ఢిల్లీలో అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించి, తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని వివరించామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో కులగణన నిర్వహించాలని కోరామని చెప్పారు. జనగణన నిర్వహించే సమయంలోనే కులగణనను కూడా అందులో చేర్చుతామని అప్పట్లో కేంద్రం చెప్పిందని భట్టి గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో కులగణనను చేర్చకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనగణనలో కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. కులగణన లేకుండా దేశంలోని బలహీన వర్గాల వాస్తవ పరిస్థితులను ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. కులగణనను చేర్చకుండా ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ?"కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలి. కులగణనకు అనుకూలమైతే సభ తరపున కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి పిలుపునివ్వాలి. వ్యతిరేకమైతే అదే విషయాన్ని స్పష్టంగా చెప్పాలి" అని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో సర్వే జరిగిన విషయాన్ని అసెంబ్లీలోనే అభినందించి, ఇప్పుడు దేశంలో ఎక్కడా కులగణన జరగలేదని చెప్పడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరుతున్నామని స్పష్టం చేశారు. సమాజంలో ఆస్తులు, వనరులు అందరికీ సమానంగా అందడం లేదని భట్టి పేర్కొన్నారు. ఈ అసమానతలను తొలగించాలంటే ముందుగా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవాల్సి ఉంటుందని అన్నారు. "సమాజం ఆరోగ్యంగా లేకపోతే ముందుగా ఎక్స్‌రే తీయాలి. వ్యాధిని నిర్ధారించాలి. ఆ తర్వాతే చికిత్స చేయాలి. సమాజంలో ఉన్న అసమానతలను గుర్తించే ఎక్స్‌రేనే కులగణన" అని భట్టి అభివర్ణించారు. కులగణన ద్వారా వివిధ సామాజిక వర్గాల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయని, ఆ సమాచారం ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి విధానాలను రూపొందించవచ్చని అన్నారు. జనాభా ప్రాతిపదికన అవకాశాలు, వనరులు, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. దేశంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా తెలంగాణలో నిర్వహించిన తరహాలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ సర్వే ద్వారా దేశంలోని వివిధ సామాజిక వర్గాల వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, వాటి ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. జనాభా ప్రాతిపదికన దేశ అభివృద్ధికి అవసరమైన నిధులు, వనరులు, అవకాశాలు, ఆస్తులు అందరికీ న్యాయంగా, సమానంగా చేరేలా విధానాలను అమలు చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# రైతులకు యాంత్రీకరణ పథకం

- రైతు కోరుకున్న పనిముట్టు.. నచ్చిన కంపెనీ నుంచే కొనుగోలు
- సబ్సిడీ సొమ్ము నేరుగా రైతుఖాతాకే బదిలీ
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :** రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ యంత్ర పరికరాలు అందించడంతో పాటు, వారి అవసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. యాంత్రీకరణ పథకం కింద రైతులకు నాణ్యమైన, ప్రమాణాలు కలిగిన వ్యవసాయ యంత్ర పరికరాలను మాత్రమే అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. తయారీదారులు, సరఫరాదారులు అందించే ఉత్పత్తులను ఫార్మ్ మెషినరీ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్స్టిట్యూట్ లేదా కేంద్ర వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన సంస్థల వద్ద పరీక్షించిన తర్వాతనే రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతుల భద్రత, యంత్రాల నాణ్యత, పనితీరు వంటి అంశాల్లో ఎలాంటి రాజీ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించే పరికరాలు వారు కోరుకున్న విధంగా లభించడం లేదని, సబ్సిడీపై అందించే యంత్రాలకు, మార్కెట్లో లభించే యంత్రాలకు తేడా ఉంటుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రస్తావించారు. సబ్సిడీ పరికరాలకు ఇచ్చే కొటేషన్ ధరలు, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం ఉంటోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించి తిరిగి అమలులోకి తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం ద్వారా రైతులపై శారీరక శ్రమ తగ్గడంతో పాటు, సాగు ఖర్చులు తగ్గి, సమయానికి వ్యవసాయ పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకం కోసం ప్రభుత్వం రూ. 71 కోట్లు కేటాయించగా, రూ. 63.11 కోట్లు ఖర్చు చేసి 15,565 వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకానికి రూ. 147.91 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతుల డిమాండ్‌ను అనుగుణంగా, అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలను యాంత్రీకరణ పథకం కింద సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు అందించే పరికరాలపై ప్రభుత్వం గణనీయ-ంమైన సబ్సిడీని అందిస్తోందని మంత్రి తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో

# 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మోదీ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పేర్కొన్నారు.

## తెలంగాణలో అనలాగ్ పనీర్ బంద్

(మొదటిపేజీ తరువాయి)



ఏడాది పాటు పూర్తి నిషేధం విధిస్తూ రాష్ట్ర ఆహార భద్రతా శాఖ కమిషనర్ గురువారం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్–2006 లోని సెక్షన్ 30(2)(ఎ) కింద ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. అసలైన పన్నీర్‌ను ఆవు లేదా గేదె పాలతో తయారు చేస్తారు. అయితే, కొందరు కల్తీ రాయుళ్లు అధిక లాభాల కోసం చుక్క పాలు కూడా వాడకుండా పామాయిల్, చౌకైన వెజిటబుల్ ఫ్యాట్స్, పిండి పదార్థాలు, రసాయనాలు కలిపి అచ్చం పన్నీర్‌లా ఉండే అనలాగ్ పన్నీర్ ను తయారు చేస్తున్నారు. చూడటానికి, రుచికి ఇది అసలు పన్నీర్‌లాగే ఉండటంతో సామాన్య ప్రజలు తేడాను గుర్తించలేకపోతున్నారు. మార్కెట్లో అసలు పన్నీర్ ధరకు సగానికే ఇది లభిస్తుండటంతో హోటళ్లు, బేకరీలు, రోడ్ సైడ్ ఫుడ్ సెంటర్లు వీటిని విచ్చలవిడిగా కొనుగోలు చేసి వినియోగదారులకు వడ్డిస్తున్నాయి. ఈ అనలాగ్ పన్నీర్ వాడకం వెనుక తీవ్రమైన ఆరోగ్య ముప్పు దాగి ఉందని ఆహార భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెజిటబుల్ ఫ్యాట్స్, రసాయనాల మిశ్రమంతో కూడిన ఈ కల్తీ పన్నీర్‌ను క్రమంగా తీసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ విపరీతంగా పెరిగిపోయి గుండెజబ్బులు, కాలేయ సమస్యలు , జీర్ణకోశ వ్యాధులు తలెత్తుతాయి. దీర్ఘకాలంలో ఇది క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆహార భద్రతా టాస్క్‌ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలకు దిగనున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి అనలాగ్ పన్నీర్‌ను తయారు చేసినా, హోటళ్లకు సరఫరా చేసినా లేదా విక్రయించినా బాధ్యులపై ఆహార భద్రతా చట్టం కింద కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని కమిషనర్ తీవ్ర హెచ్చరిక చేశారు. అయితే, పూర్తి నిబంధనల ప్రకారం స్వచ్ఛమైన పాలతో తయారయ్యే సాధారణ డెయిరీ పన్నీర్ విక్రయాలకు ఈ నిషేధంతో ఎలాంటి సంబంధం లేదని అధికారులు స్పష్టత ఇచ్చారు. హోటళ్లు, రెస్టారెంట్లు తాము వాడుతున్న పన్నీర్ నాణ్యతను నిరూపించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇప్పటికే హోటళ్లు, తయారీ యూనిట్లు, ప్రాసెసింగ్ ప్లాంట్లపై ఆకస్మిక దాడులు ప్రారంభించారు. రసాయనాలతో పన్నీర్ తయారు చేసే ముఠాల సమాచారం సేకరిస్తూ శాంపిళ్లను ల్యాబ్‌లకు పంపుతున్నారు. ప్రజలు కూడా ఆహార నాణ్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫుడ్ సెంటర్లపై ఆహార భద్రతా శాఖకు టోల్ ఫ్రీ నంబర్ లేదా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ నిర్ణయంతో నగరంలో కల్తీ పన్నీర్ దందాకు అడ్డుకట్ట పడుతుందని సగటు పౌరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

## పలువురు ప్రముఖులకు ఈసీ నోటీసులు




**హైదారాబాద్, సెప్టెంబర్ 11 :** కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన నిమిత్తమే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ జాబితాలో నటుడు మహేశ్ బాబు, ఆయన భార్య నమ్రత, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండలతో పాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నట్లు సమాచారం. ఫార్మా దిగ్గజం మురళీ కృష్ణ ప్రసాద్ దివి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుత వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్దిష్టమైన కారణం ఏదీ పేర్కొనలేదని కూడా వార్తలు వస్తున్నాయి. నోటీసులు అందుకున్న వారు నేరుగా హాజరై తమ వివరాలను సరిచూసుకోవచ్చని లేదా అవసరమైన పత్రాలను సమర్పించి పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో తమ తరఫున ప్రతినిధులను పంపేందుకు కూడా అవకాశం కల్పించారు. అయితే, నోటీసు జారీ అయినంత మాత్రాన ఓటు హక్కు రద్దయినట్లు కాదని, ఇది కేవలం ధ్రువీకరణ ప్రక్రియలో ఒక భాగం మాత్రమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా సాగుతోంది. కర్ణాటకలోనూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, జెరోధా వ్యవస్థాపకులు నితిన్, నిఖిల్ కామత్‌లకు కూడా ఇటువంటి నోటీసులే అందాయి. ఇదే క్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న సీఎన్ఆర్ రావుకు కూడా నోటీసు జారీ అయిందన్న వార్తలను ఎన్నికల సంఘం ఖండించింది.

## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

- కో-ఆప్షన్ సభ్యులుగా వారికి అవకాశం
- అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం

**హైదారాబాద్, సెప్టెంబర్ 11 :** తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్ జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.




## జీహెచ్‌ఎంసీకి యాడ్ ఏజెన్సీల భారీ బకాయిలు

**రూ. 39.74 కోట్లు పెండింగ్**

**హైదారాబాద్, సెప్టెంబర్ 11 :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోని అవుట్‌డోర్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు భారీగా బకాయిలు పడ్డాయి. ఈ ఏజెన్సీల నుంచి జీహెచ్‌ఎంసీకి సుమారు రూ.39.74కోట్లు (ఖచ్చితంగా రూ. 39,74,15,778) రావాల్సి ఉందని తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా, పురపాలక-పట్టణాభివృద్ధి శాఖ సెప్టెంబరు 10న శాసనమండలిలో ఈ వివరాలను సమర్పించింది. ప్రభుత్వం అందించిన నివేదిక ప్రకారం.. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో మొత్తం 452 ఏజెన్సీ ఎంట్రీలు, 1,521 అడ్వర్టైజ్‌మెంట్ యూనిట్లకు సంబంధించి ఈ బకాయిలు పేరుకుపోయాయి. బకాయిదారుల జాబితాలో పలు ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ముఖ్యంగా, యూనియాడ్స్ అనే సంస్థ ఒక్క యూనిట్‌కే అత్యధికంగా రూ. 7.71 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఐ క్యాచ్ కమ్యూనికేషన్స్ మరో యూనిట్‌కు సంబంధించి రూ. 6.47 కోట్లు బకాయిపడింది. అత్యధిక యూనిట్లు కలిగిన సంస్థల్లో ప్రకాశ్ ఆర్ట్స్ ముందు వరుసలో ఉంది. ఈ సంస్థకు చెందిన 53 యూనిట్లకు గానూ మొత్తం రూ. 5.35 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటితో పాటు మీడియా కార్ప్ రూ. 5.06 కోట్లు, సీఎంఎస్ఎస్ రూ. 1.79 కోట్లు, అవుట్‌స్పేస్ అడ్వర్టైజింగ్ రూ. 1.86 కోట్ల చొప్పున బకాయిలు చెల్లించాల్సి ఉంది. అవుట్‌డోర్ ప్రకటనల నియంత్రణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది మార్చి, జూన్ నెలల్లో 'అవుట్‌డోర్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ ఫర్ క్యూర్-2026'ను జారీ చేసింది. దీని ప్రకారం.. ప్రైవేట్ ఆస్తులపై ప్రదర్శించే ప్రకటనలకు ఆన్‌లైన్ ద్వారా, ప్రభుత్వ ఆస్తులపై ప్రకటనలకు టెండర్ల ద్వారా అనుమతులు మంజూరు చేస్తారు. అయితే, ఫీజుల వసూలుకు సంబంధించి 2020 నాటి మార్గదర్శకాలు ప్రస్తుతం నిలిపివేతలో ఉన్నాయని, త్వరలోనే సమగ్రమైన కొత్త విధానాన్ని తీసుకురానున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

## రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

**మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారు**

**తెలంగాణలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభ**

**జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 11 :** తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

## మూసీ ప్రాజెక్టుపై అడ్డంకులు

**రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ**

**విచారణ అక్టోబర్ 16కు వాయిదా**

**హైదారాబాద్, సెప్టెంబర్ 11 :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ కొందరు రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన ట్రిబ్యునల్, ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి అధికారికంగా నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించిన పర్యావరణ నిబంధనలు మరియు అనుమతుల్లో స్పష్టమైన లోపాలు ఉన్నాయని పిటిషనర్లు తమ పిటిషన్‌లో ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటే, కేవలం 20 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే అధ్యయనం చేయడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఇదే ప్రాంతంలో ప్రముఖ 'మృగవాణి జాతీయ పార్కు' కూడా ఉన్న విషయాన్ని వారు ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువచ్చారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిసర ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపై రిటైర్డ్ ఇంజినీర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో వాణిజ్య సముదాయాల ఏర్పాటు నిర్ణయం పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని వాదించారు. ఈ ప్రాజెక్టు వల్ల భవిష్యత్తులో పర్యావరణంపై పడే దుష్ప్రభావాలను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు స్పష్టం చేశారు. పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ కొద్దికాలం క్రితం న్యాయపరమైన వివాదాలు నడిచినా, ఇప్పుడు తాజా పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం రాజకీయంగా కూడా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

## ఆర్మీ ఆయుధాల చోరీ కేసు

- కేసులో నలుగురు నిందితులను అరెస్ట్
- డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి



**హైదారాబాద్, సెప్టెంబర్ 11:** హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.



## ఉద్యోగులకు ప్రమాద బీమా

- కోటి రూపాయల బీమా అందిస్తున్నాం
- ఒక్క రూపాయి ప్రీమియం లేకుండానే బీమా
- ఈ బీమాతో 12.91 లక్షల మందికి లబ్ధి
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి

**హైదారాబాద్, సెప్టెంబర్ 11 :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్ర ఖజానాపై, ఉద్యోగుల వేతనాలపై రూపాయి భారం పడకుండా, మానవీయ కోణంలో దేశంలోనే తొలిసారిగా రూ. కోటి దాకా ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు. ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే 89 ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారాన్ని అందించినట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఇందులో ?సింగరేణిలో 50, విద్యుత్ శాఖ ఉద్యోగులు 15, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 24 మంది ఉన్నారన్నారు. శాలరీ, పెన్షన్ అకౌంట్ ప్యాకేజీల ఆధారంగా బీమా ప్రయోజనాలు వర్తిస్తాయని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణం, శాశ్వత వైకల్యం సంభవిస్తే ఉచిత బీమా వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. 2.20 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు కవరేజ్ లభిస్తుందని, సాధారణ ప్రమాద మరణానికి కూడా కొన్ని కేటగిరీల్లో రూ. 1.50 కోట్ల కంటే ఎక్కువ బీమా అందుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం 12,91,046 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వ్యవస్థకు ఉచిత బీమా వర్తిస్తుందని వెల్లడించారు. ఇందులో 5,18,293 మంది రెగ్యులర్ ప్రభుత్వ సిబ్బంది ఉన్నారన్నారు. అలాగే 5,00,158 మంది తాత్కాలిక సిబ్బంది , 2,72,615 మంది పెన్షనర్లు కవర్ అవుతారని వివరించారు. ఈ పథకాన్ని మొదటిగా ఫిబ్రవరి 2024లో సింగరేణి ఉద్యోగులకు, ఆ తర్వాత జూన్ 2024 నుంచి విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అందరికీ వర్తింపజేశామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని శాఖల అధిపతులకు, కార్యదర్శులకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని సభలో తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల అనర్హుల ఖాతాల్లో రూ.10వేలు రిఫండ్

**హైదారాబాద్, సెప్టెంబర్ 11 :** ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అప్లై చేసి.. లిస్ట్‌లో పేరు రాలేదా? అయితే మీకు గుడ్ న్యూస్. అప్లికేషన్ సమయంలో డిపాజిట్‌గా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని హౌసింగ్ బోర్డు తిరిగి దరఖాస్తుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనుంది. ఈ రిఫండ్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుందని హౌసింగ్ బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం అప్లై చేసే సమయంలో ప్రతి ఒక్కరి నుంచి రూ.10 వేల చొప్పున ధరావతు మొత్తాన్ని తీసుకున్న విషయం తెలిసిందే. అయితే దరఖాస్తులను వివిధ శాఖల రికార్డులతో క్రాస్ చెక్ చేసిన అధికారులు.. అర్హత లేని దరఖాస్తులను గుర్తించారు. హైదరాబాద్‌లోని 16 నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 60,720 దరఖాస్తులు వచ్చాయి. వీటిని రెవెన్యూ, రవాణా, జీహెచ్‌ఎంసీ తదితర శాఖల నుంచి సేకరించిన వివరాలతో అధికారులు వెరిఫై చేశారు. ఈ వెరిఫికేషన్‌లో భాగంగా 360 డిగ్రీల తనిఖీ చేపట్టిన హౌసింగ్ బోర్డు.. తొలి దశలోనే సుమారు 40 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించింది. దీంతో అర్హత సాధించని వారికి వారు ముందుగా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు చర్యలు చేపట్టింది. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరు అప్లికేషన్ సమయంలో తమ మొబైల్ నంబర్లను తప్పుగా నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫోన్ నంబర్ మార్చుకునే అవకాశం కల్పించాలని పలువురు లబ్ధిదారులు కోరారు. దీనిపై స్పందించిన అధికారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోనే మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంపికైన లబ్ధిదారులు తమ దరఖాస్తు నంబర్ లేదా ఆధార్ నంబర్ ఉపయోగించి అప్లికేషన్‌లోకి వెళ్లి వివరాలను మార్చుకోవచ్చు. మరోవైపు హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన కుటుంబాలపై క్షేత్రస్థాయి సర్వే కొనసాగుతోంది. ఇప్పటివరకు సుమారు 5,500 కుటుంబాలను అధికారులు నేరుగా పరిశీలించినట్లు సమాచారం. లబ్ధిదారుల వివరాలు, అర్హత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో చెక్ చేస్తున్న అధికారులు.. సర్వేను మరో రెండు రోజుల్లో పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత తుది జాబితాను సిద్ధం చేసి హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అంటే.. అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ముందుకు వెళ్లనుండగా, అర్హత సాధించని దరఖాస్తుదారులకు మాత్రం వారి రూ.10 వేల డిపాజిట్ తిరిగి రానుంది.

# మొహం చాటేసిన వర్షాలు!



**ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితులే ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు మినహా ఎక్కడా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. మరోవైపు వర్షాకాలం చివరికి వస్తున్న కొద్దీ దేశంలోని రైతన్నల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాతావరణ శాఖ వెల్లడించిన తాజా అంచనాల ప్రకారం.. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్ నినో' ప్రభావం రబీ పంటల సాగుపై తీవ్ర ముప్పుగా పరిణమించేలా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది.**

వర్షాకాలం ముగిసే సమయానికి వర్షాలు మొహం చాటేస్తే.. వచ్చే శీతాకాలంలో వేసే రబీ పంటల పరిస్థితి ఏంటనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్‌లో వర్షాలు పడకపోయినా విత్తనాలు వేసే సమయం మారకపోవచ్చు కానీ, నేలలో తేమ శాతం దారుణంగా పడిపోతుంది. ప్రస్తుతం దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా, ఇప్పుడు అది 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి నిల్వలు లేకపోతే విత్తనాలు మొలకెత్తడమే కష్టమవుతుంది. భారతీయ వ్యవసాయంలో రబీ కాలం చాలా కీలకమైనది. ముఖ్యంగా నీటి లభ్యత , నేలలోని తేమపై ఆధారపడే గోధుమ, ఆవాలు, శనగ పంటలు ఈసారి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో గోధుమలు, ఆవాల సాగు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ మొదటి తడికి రిజర్వాయర్ నీళ్లే ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో వేసే శనగ పంట కేవలం భూమిలోని తేమ ఆధారంగానే పెరుగుతుంది.

వర్షాలు లేక భూమి ఎండిపోతే ఈ పంటల దిగుబడి దారుణంగా పడిపోతుంది. ఎల్ నినో వల్ల ఏర్పడే కరవు పరిస్థితులను అధిగమించడానికి 'ఇండియన్ ఓషన్ డైపోల్' కాస్త ఆశాకిరణంగా కనిపిస్తోందని నిపుణులు చెప్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఈ సానుకూల మార్పు వల్ల భారత్ వైపు వర్షపు మేఘాలు తొలకరిచ్చే అవకాశం ఉంది. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్ నినో తీవ్రతను ఈ ఐఓడీ కొంతవరకు తగ్గించగలిగింది. అయితే, ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమవుతుంది కాబట్టి, ఎండిపోయిన భూగర్భ జలాలను, ఖాళీ అయిన రిజర్వాయర్లను ఎంతవరకు నింపుతుందనేది అనుమానంగానే ఉంది. ఒకవేళ అక్టోబర్, నవంబర్ నెలల్లో భూమిలో తేమ శాతం పెరగకపోతే రబీ పంటల విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా దెబ్బతింటాయి. దీనివల్ల రాబోయే రోజుల్లో గోధుమలు, పప్పుధాన్యాలు, వంటనూనెల సరఫరా తగ్గి, నిత్యావసర ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రైతుల ఆదాయాన్నే కాకుండా, సామాన్య ప్రజల జేబులకు కూడా పెద్ద కన్నం వేసేలా కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కరవు తాండవిస్తోంది. ఓవైపు వర్షాధార పంటల సాగును చాలా వరకు తగ్గించినప్పటికీ మరోవైపు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరి సైతం చేతికందేలా లేదు. భూగర్భజలాలు దారుణంగా పడిపోయి, బోర్లు వట్టిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూడలేక అన్నదాతలు బావుల్లో పూడిక తీయిస్తూ కొత్త బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు పడటం లేదు. ఈ వర్షాభావ పరిస్థితులు మరో వారం, పదిరోజుల పాటు కొనసాగితే పంటలపై ఆశలు వదిలేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు నమోదయ్యేది. కానీ ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు అంటే సుమారు 92 శాతం మేరకే సాగు చేసినట్టు వ్యవసాయశాఖ గణాంకాలు నివేదిస్తున్నాయి. ప్రధానంగా 66 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు నమోదవుతుండగా ఈసారి 52.81 లక్షల ఎకరాల్లో(80 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. ఇక పత్తి అంచనా సాగు 47 లక్షల ఎకరాలకు గాను 48 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. 6.49 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగవుతుండగా 7.86 లక్షల ఎకరాలకు చేరింది. అధికంగా నీటి ఆధారమైన వరి సాగు 20 శాతం వరకు తగ్గింది. కానీ చాలా ప్రాంతాల్లో నాట్లు వేసిన రైతులు మాత్రం పంటను కాపాడుకోడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు. రాష్ట్రంలో ఈ సీజన్‌కు సంబంధించి ఇప్పటిదాకా 49 రోజులే వర్షం కురిసింది. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మి.మీ మాత్రమే కురిసింది. మొత్తంగా 20 శాతం లోటు వర్షపాతం ఏర్పడగా 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తక్కిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40 శాతం లోటులో కొనసాగుతుండటం గమనార్హం. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం దాదాపు 2 మీటర్లకు పైగా పడిపోయింది. గత సంవత్సరం ఆగస్టు చివరి నాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ఇప్పుడు 7.87 మీటర్లకు పడిపోవడం గమనార్హం. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీటర్లు, అలాగే వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 3 మీటర్లకు లోతులోకి నీటిమట్టాలు పడిపోయాయి. వర్షాలు కురవక, సాగునీరు లేక అన్నదాతలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీటిని బయటకు తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలంలోని పుల్గర గ్రామంలో ఉన్న కొత్త చెరువు పరిధిలో 50 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగవుతోంది. ఇలాంటి పరిస్థితిలో మున్ముందు కొనసాగితే సాగు నీటికే కాదు తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

12-09-2026 — ఎడిటర్

## జూన్ నాటికి ఉప్పల్-నారపల్లి
# ఫ్లైఓవర్ పూర్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 : హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల వాహనదారులకు ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేసి, 2027 జూన్ నాటికి ఫ్లైఓవర్‌ను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఉప్పల్--నారపల్లి మార్గంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు వరంగల్ వైపు వెళ్లే వాహనాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నప్పటికీ పలు కారణాల వల్ల నిర్మాణం అనుకున్న సమయానికి పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో పనుల్లో వేగం పెంచి వచ్చే ఏడాది జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవానికి ఈ ఫ్లైఓవర్‌ను ఈ ఏడాది దసరా నాటికి అందుబాటులోకి తీసుకురావాలని గతంలో భావించారు. అయితే కాంట్రాక్టు సంస్థకు సంబంధించిన సమస్యలు, భూసేకరణ, వ్యయపరమైన అంశాలు తదితర కారణాలతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రాజెక్టు కాంట్రాక్టర్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో నిర్మాణ ప్రక్రియలో అంతరాయం ఏర్పడిందని మంత్రి వివరించారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు సెకండరీ ఏజెన్సీని రంగంలోకి తీసుకురావాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయలేకపోయామని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న అవరోధాలను తొలగించి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యంతో ప్రాజెక్టు పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. జాతీయ రహదారి--163పై ఉప్పల్--నారపల్లి మధ్య ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సుమారు రూ.425 కోట్ల అంచనా వ్యయంతో 2018లో పనులు ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో మూడేళ్లలోనే నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ వివిధ కారణాలతో ప్రాజెక్టు గడువు పలుమార్లు పొడిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారిడార్ పూర్తయితే ఉప్పల్, నారపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు తూర్పు దిశగా ప్రయాణించే వాహనాలకు గణనీయంగా ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని వరంగల్, భువనగిరి, జనగామ ప్రాంతాలతో పాటు బీబీనగర్‌లోని ఎయిమ్స్‌తో అనుసంధానించడంలో ఈ మార్గం కీలకంగా మారనుంది. ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయ అధికారులు, చీఫ్ ఇంజినీర్‌తో ఇటీవల ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. పెండింగ్ అంశాలను పరిష్కరించి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ప్రాజెక్టులో భాగంగా కొన్ని బీటీ రోడ్డు పునరుద్ధరణ, మరమ్మత్తు పనులు పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. మిగిలిన నిర్మాణ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి 2027 జూన్ నాటికి ఉప్పల్--నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌ను పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఉప్పల్--నారపల్లి మార్గంలో ప్రయాణించే వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు నగర తూర్పు వైపు విస్తరిస్తున్న ప్రాంతాలకు రవాణా కనెక్టివిటీ మెరుగుపడే అవకాశం ఉంది.



## బీసీల జనాభా లెక్కలు తేల్చాలి..
# కులగణన చేపట్టాలి

- బీసీల రిజర్వేషన్లు దానం కాదు..
- హక్కు, సామాజిక న్యాయం కోసం దశాబ్దాల పోరాట ఫలితం
- కేంద్రానికి మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 11 : దేశవ్యాప్తంగా బీసీల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీలో కులగణనపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, అది బీసీల హక్కు, సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా సాగిన పోరాట ఫలితమని మంత్రి స్పష్టం చేశారు. 1953లో అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం కాకా కాలేల్కర్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం 1979లో బి.పి. మండల్ కమిషన్ ఏర్పడి దేశవ్యాప్తంగా బీసీల సామాజిక, విద్యా వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ సిఫారసు చేసిందని, 1990లో ఆ సిఫార్సులు అమలుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని గుర్తు చేశారు. 1992లో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి కీలకమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. 1993లో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పడిందని, 2018లో 102వ రాజ్యాంగ సవరణ ద్వారా దానికి రాజ్యాంగ హోదా లభించిందని తెలిపారు. నాడీజ రిజర్వేషన్ల ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా అనే అంశాన్ని పరిశీలించేందుకు జస్టిస్ రోహిణి కమిషన్‌ను కూడా కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణలో సమగ్ర కుల సర్వే చారిత్రక నిర్ణయం-మంత్రి వాకిటి శ్రీహరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే సామాజిక న్యాయానికి పునాది అని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఎవరు ఎంతమంది ఉన్నారు? వారి సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితి ఏమిటి? ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి ప్రాతినిధ్యం ఎంత? రాజకీయంగా వారి వాటా ఎంత? అనే అంశాలను డేటా ఆధారంగా తెలుసుకునేందుకు సమగ్ర కుల సర్వే నిర్వహించామని తెలిపారు. "ఇది కేవలం ఒక సర్వే కాదు.. సామాజిక న్యాయానికి పునాది. బీసీల హక్కులకు బలమైన ఆధారం" అని మంత్రి పేర్కొన్నారు. "జితనీ ఆబాదీ.. ఉత్నా హక్" రాహుల్ గాంధీ నినాదంతో ముందుకుసాగుతున్నాం-మంత్రి వాకిటి శ్రీహరి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలు కన్నది సామాజిక సమానత్వమని మంత్రి అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన "జితనీ ఆబాదీ, ఉత్నా హక్" నినాదం సామాజిక న్యాయానికి దిశానిర్దేశం చేస్తోందన్నారు. జనాభాలో ఎంత వాటా ఉంటే అవకాశాలు, అధికారంలో అంత వాటా ఉండాలనే స్ఫూర్తితో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. కేంద్రంలో పదకొండేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల జనాభా లెక్కలు తేల్చడానికి ఎందుకు వెనుకడుగు వేస్తోందని మంత్రి ప్రశ్నించారు. "బీసీలు ఎంతమంది ఉన్నారో తెలియకుండా వారికి ఎంత వాటా ఇవ్వాలో ఎలా నిర్ణయిస్తారు? డేటా లేకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యం?" అని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం చేయాలంటే ముందుగా వారి జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై ఖచ్చితమైన గణాంకాలు అవసరమని అన్నారు. "కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను స్పష్టంగా చేర్చాలి. బీసీలకు లెక్కించాలి.. బీసీలకు న్యాయం చేయాలి" అని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. "కులగణన చేయండి.. సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయండి" అని ఆయన కేంద్ర ప్రభుత్వానికి పిలుపునిచ్చారు.

## పాలిటెక్నిక్ కళాశాలలను
# ప్రైవేటీకరించే ప్రసక్తేలేదు

**శాసనసభలో మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి**

హైదరాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి శాసనసభ సాక్షిగా తేల్చి చెప్పారు. పాలిటెక్నిక్ విద్యారంగంలో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు గాను రూ. 8,000 కోట్లతో భారీ ఎత్తున కళాశాలలను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ మార్పుల వల్ల కళాశాలలు ప్రైవేటీకరణ జరుగుతుందేమోనని విద్యార్థులు, అధ్యాపకుల్లో నెలకొన్న అనుమానాలు, అపోహలను తొలగించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఎటువంటి భంగం వాటిల్లకుండా, సాంకేతిక విద్యను అందరికీ అందుబాటులో ఉంచడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న విమర్శలపై మంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాలిటెక్నిక్ కళాశాలల ప్రైవేటీకరణ పై బిఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా విషప్రచారం చేస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా విధానంలో పారదర్శకత కోసం, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైతే జీవో 97 లో తగిన మార్పులు చేర్పులు చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అంతేకాకుండా, కళాశాలల్లో ఎలాంటి ఫీజుల పెంపు ఉండదని, పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను నిరంతరం అందిస్తామని మంత్రి వివేక్ అసెంబ్లీలో స్పష్టం చేశారు.



## కాంగ్రెస్ అసమర్థ పాలనతో రైతుల పరిస్థితి దయనీయం

**బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ ఆవేదన**

హైదరాబాద్, సెప్టెంబర్ 11 : ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సాగునీరు, విద్యుత్ సరఫరా సరిగా లేక రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం కష్టపడి పండించిన పంటలను కాపాడుకునేందుకు అవసరమైన నీటిని, నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ఏడు ఎల్ నినో ప్రభావం ఉంటుందని ముందుగానే వాతావరణ శాఖ సంకేతాలు ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడంలో విఫలమైందని పువ్వాడ మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థ నిర్ణయాల వల్లే క్షేత్రస్థాయిలో పంట పొలాలు ఎండిపోయే తీవ్రమైన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ఎద్దడి, విద్యుత్ కోతల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ, బాధితుల తరఫున పోరాటాలు చేస్తున్నప్పటికీ పాలకులు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉదాసీనత కారణంగా జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు భారీ నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వెంటనే స్పందించి అధికారులు క్షేత్రస్థాయిలో ఎండిపోతున్న పంటలను స్వయంగా పరిశీలించాలని, అత్యవసర ప్రాతిపదికన సాగునీరు, అరకొర కోతలు లేకుండా ఉచిత విద్యుత్ సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## గచ్చిబౌలిలో
# దారుణ హత్య

హైదరాబాద్, సెప్టెంబర్ 11 : హైదరాబాద్‌లో దారుణ హత్య వెలుగు చూసింది. రాయదుర్గం పీఎస్ పరిధిలో ఓ వ్యక్తిని దారుణంగా కత్తులతో పొడిచి హత్య చేశారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. అంజయ్యనగర్‌లోని హరిహర మెన్ హాస్టల్‌లో శశిధర్(43) వంటమనిషిగా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలోని శివబాలాజీ హాస్టల్‌లో ప్రమోద్ అనే వ్యక్తి చాఫ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఇద్దరి మధ్య ఏదో విషయం పై చిన్న గొడవ జరిగింది. వివాదం తీవ్ర రూపం దాల్చడంతో ప్రమోద్ కత్తితో శశిధర్‌పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడిన శశిధర్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న వెంటనే రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఒడిశాలోని మయూర్భంజ్ జిల్లా దుము రియా మండలం సరాధా గ్రామానికి చెందిన శశిధర్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడిగా అనుమానిస్తున్న ప్రమోద్ స్వస్థలం బాలేశ్వర్ జిల్లా బెల్గోనియా గ్రామంగా గుర్తించారు. అసలు ఈ హత్యకు కారణం ఏమిటి? శశిధర్, ప్రమోద్ మధ్య గతంలో ఏవైనా గొడవలు ఉన్నాయా? హత్యకు ముందు ఇద్దరి మధ్య ఏం జరిగింది? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అసెంబ్లీకి ట్రాక్టర్లపై వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్షం నిరసన వ్యక్తం చేసింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు బీజేపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ట్రాక్టర్లతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతుల పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ విధానంపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఎండగడుతూ ఈ వినూత్న నిరసనకు శ్రీకారం చుట్టారు. ఈ ర్యాలీకి బీజేపీ శాసనసభా పక్ష నేతలు, ఎమ్మెల్యేలు , ముఖ్య నాయకులు నేతృత్వం వహించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న వేళ, రైతుల సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఎమ్మెల్యే క్వార్టర్స్ బయట ట్రాక్టర్లపై ఎక్కి నినాదాలు చేస్తూ అసెంబ్లీ వైపు దూసుకెళ్లారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడాలని, ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు ఫసల్ బీమా యోజన ద్వారా వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ర్యాలీగా వస్తున్న బీజేపీ ఎమ్మెల్యేల ట్రాక్టర్లను అసెంబ్లీ పరిసరాల్లో పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు పొరుగు రాష్ట్రాలు ఫసల్ బీమా యోజనను సమర్థవంతంగా అమలు చేస్తూ రైతులను ఆదుకుంటుంటే, తెలంగాణలో మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర పథకాన్ని పక్కనపెడుతున్నారని మండిపడ్డారు. ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్ల ఏటా వేలాది మంది రైతులు పంటలు నష్టపోయి ఆర్థికంగా చితికిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే ఇస్తామని హామీ ఇచ్చిన 500 బోనస్, పంటల భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు.

ప్రాంతీయం

# ఖమ్మం సర్వజనాసుపత్రిలో వైద్య విప్లవం

- త్వరలో ఎంఆర్ఐ.. పడక వద్దే ఎక్స్‌రే..
- అధునాతన స్కానింగ్ సేవలతో ప్రభుత్వ వైద్యానికి కొత్త బలం
- కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చొరవతో మౌలిక వసతుల విస్తరణ
- పేదలకు ఉచితంగా అత్యాధునిక నిర్ధారణ పరీక్షలు
- రేడియాలజీ సేవలకు నిపుణుల బలం



**ఖమ్మం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** ప్రభుత్వ వైద్యం అంటే సాధారణ చికిత్సలకే పరిమితం అనే భావనకు చెక్ పెడుతూ ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రి ఆధునిక వైద్య సేవలకు కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. అధునాతన స్కానింగ్ సదుపాయాలు, పోర్టబుల్ అల్ట్రాసౌండ్, పడక వద్దే ఎక్స్‌రే, కలర్ డాప్లర్, కాంట్రాస్ట్ సీటీ, హెచ్ఆర్ సీటీ వంటి కీలక నిర్ధారణ సేవలు ఇప్పటికే అందుబాటులోకి రాగా.. త్వరలో ఎంఆర్ఐ సేవలు కూడా ప్రారంభం కానున్నాయి. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక పర్యవేక్షణతో ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్ సదుపాయాలు, వైద్య పరికరాలు, నిపుణుల సేవలపై సమన్వయంతో చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర మంత్రుల ప్రత్యేక శ్రద్ధ కూడా తోడవడంతో ప్రభుత్వ వైద్య రంగానికి ఖమ్మంలో కొత్త ఊపు వచ్చింది.

### త్వరలో ఎంఆర్ఐ.. రోగులకు భారీ ఊరట

సర్వజనాసుపత్రిలో ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటు కోసం అవసరమైన సివిల్ పనులను వేగవంతం చేస్తున్నారు. యంత్రం నిరంతరాయంగా పనిచేసేలా ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంఆర్ఐ అందుబాటులోకి వస్తే మెదడు, వెన్నెముక, కీళ్లు, కండరాలు, అంతర్గత అవయవాలకు సంబంధించిన అనేక సమస్యలను అధునాతనంగా గుర్తించే అవకాశం కలుగుతుంది. ఖరీదైన ప్రైవేటు పరీక్షల కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం పేద, మధ్యతరగతి



ప్రజలకు గణనీయంగా తగ్గనుంది. ఇప్పటికే మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకి రావడంతో అత్యవసర, కదలలేని రోగులకు అవసరమైన చోటే పరీక్షలు నిర్వహించే వెసులుబాటు ఏర్పడింది. మరోవైపు పోర్టబుల్ ఎక్స్‌రే ద్వారా తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులను పడక నుంచి ఎక్స్‌రే విభాగానికి తరలించాల్సిన అవసరం లేకుండా పడక వద్దే ఎక్స్‌రే తీసే సదుపాయం అందుబాటులో ఉంది.

### 16,961 స్కాన్లు.. 546 టిఫ్ఫా స్కాన్లు

2026 జనవరి నుంచి ఆగస్టు వరకు సర్వజనాసుపత్రిలో 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు నిర్వహించారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఇదే కాలంలో 16,961 స్కాన్లు నిర్వహించగా.. వాటిలో 8,945 ఓబీజీ, 5,417 ఉదర భాగం, 546 టిఫ్ఫా, 2,053 చిన్నారుల స్కాన్లు ఉన్నాయి. గర్భంలోని శిశువు అవయవాల నిర్మాణం, అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితిని ముందుగానే అంచనా వేసేందుకు ఉపయోగపడే టిఫ్ఫా స్కాన్ సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందుబాటులో ఉండటం గర్భిణీలకు ప్రత్యేక భరోసాగా మారింది. ఫిబ్రవరిలో 19గా ఉన్న టిఫ్ఫా స్కాన్లు ఆగస్టులో 136కు పెరగడం ఈ సేవకు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనం. కలర్ డాప్లర్, కాంట్రాస్ట్ సీటీ, హెచ్ఆర్ సీటీ సేవలు కూడా అందుబాటులో ఉండటంతో రక్తనాళాలు, ఊపిరితిత్తులు, మెదడు, ప్రమాద గాయాలు తదితర సమస్యలను త్వరగా గుర్తించే అవకాశం ఏర్పడింది. మూడు షిఫ్టుల్లో కాంట్రాస్ట్ సీటీ సేవలు కొనసాగుతున్నాయి. రేడియాలజీ సేవలకు నిపుణుల బలం చేకూర్చే చర్యల్లో భాగంగా డాక్టర్ సురేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. డాక్టర్ మురళీకృష్ణ సేవలను సర్వజనాసుపత్రికి కేటాయించేలా కూడా చర్యలు చేపట్టారు. అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. పరికరాలు రావడమే కాదు.. అవి నిరంతరం పనిచేసేలా మౌలిక వసతులు, విద్యుత్, నిపుణుల సేవలు, సిబ్బంది అందుబాటును సమన్వయం చేయడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది. అత్యాధునిక వైద్య పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి రావడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతోంది. ప్రభుత్వ ఆసుపత్రి అంటే కేవలం ఉచిత వైద్యం కాదు.. ఆధునిక వైద్యం కూడా అందించగలదనే నమ్మకాన్ని ఖమ్మం సర్వజనాసుపత్రి బలపరుస్తోంది.





## కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు

**ఉప్పల్ :** బాగాయత్‌లోని కాలభైరవ స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని కాలభైరవ స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కాలభైరవ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాలభైరవ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## గోదాముల వద్ద పటిష్ట నిఘా ఉండాలి

- నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వద్దు
- దేవరుప్పుల ఆధునిక వ్యవసాయ మార్కెట్ గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**దేవరుప్పుల :** ప్రభుత్వ గోదాముల నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమతి లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించవద్దని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన దేవరుప్పుల మండల శివారులోని ఆధునిక వ్యవసాయ మార్కెట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాము ఆవరణను కలియదిరిగిన కలెక్టర్.. అక్కడి వసతులు, ధాన్యం భద్రపరుస్తున్న తీరును పరిశీలించారు. గోదాము గరిష్ట నిల్వ సామర్థ్యం ఎంత ఉందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నిల్వ ఉంచుతున్న బియ్యం ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయని ఆయన ఆరా తీయగా జిల్లాలోని వివిధ రైస్ మిల్లుల నుంచి ఇక్కడికి తీసుకొస్తున్నట్లు అధికారులు వివరించారు. గోదాముకు చేరిన బియ్యాన్ని తిరిగి ఎక్కడికి తరలిస్తున్నారని కలెక్టర్ ప్రశ్నించగా, ఎంఎల్ఎస్ పాయింట్లకు పంపుతున్నట్లు వారు బదులిచ్చారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. ధాన్యం నిల్వల భద్రత విషయంలో రాజీ పడొద్దని, గోదామును అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని స్పష్టం చేశారు. పరిసరాల్లో నిరంతరం నిఘా ఉంచాలని, విధుల్లో ఏమాత్రం అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనధికార వ్యక్తులెవరైనా గోదాము ఆవరణలో కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందికి ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ సంబంధిత అధికారులు, గోదాము సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో సామల హేమ

**సికింద్రాబాద్ :** వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ ను ప్రోత్సహించేలా సీతాఫల్మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ తీగుళ్ల పద్మారావు గౌడ్‌తో కలిసి మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ పాల్గొన్నారు. అనంతరం నామాలగుండు వార్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలోనూ ఆమె పాల్గొని భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. సామల హేమ మాట్లాడుతూ రసాయనాలతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. భక్తి, సంప్రదాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పర్యావరణాన్ని కాపాడుతూ భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుధీర్ సింగ్, జీహెచ్ఎంసీ శానిటేషన్ డీఈ నాగమణి, నాయకులు శైలేందర్, అశ్విన్, కృష్ణ ముదిరాజ్, బాబూరావు, సాగర్, రాజేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్‌లో మ్యాపింగ్ కాని వివరాలపై ఏఈఆర్ఓకు ఆధార పత్రాలు సమర్పించిన డా. సామల హేమ

**సికింద్రాబాద్ :** ఎస్ఐఆర్ ప్రక్రియలో తనకు సంబంధించిన కొన్ని వివరాలు మ్యాపింగ్ కాకపోవడంతో నోటీసు అందుకున్న మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ మేదిబావి ఆర్యసమాజ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రానికి వెళ్లి సంబంధిత అధికారులను కలిశారు. తన వద్ద ఉన్న ఆధార పత్రాలను ఏఈఆర్ఓ అధికారికి స్వయంగా అందజేసి, మ్యాపింగ్ కాని వివరాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా డా. సామల హేమ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్కరి పేరు లేదా వివరాలు సాంకేతిక కారణాలతో ఇబ్బందులకు గురికాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రజలకు నోటీసులు వచ్చినప్పుడు భయపడాల్సిన అవసరం లేదని, సరైన ఆధార పత్రాలతో అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఆర్ఓ వేణు, బీఎల్ఓ అర్చన పాల్గొన్నారు.

## నేడు జాతీయ లోక్ అదాలత్

- రాజీతో కేసులకు పరిష్కారం!
- ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం
- రాజీ పడదగిన కేసులను సత్వరమే పరిష్కరించుకునే సువర్ణావకాశం

**ఖమ్మం,ఆర్గాన్ న్యూస్,సెప్టెంబర్ 11:** కేసుల పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకునే అవసరం లేకుండా రాజీ మార్గంలో వివాదాలకు ముగింపు పలికే జాతీయ లోక్ అదాలత్ నేడు (శనివారం) ఖమ్మంలో నిర్వహించనున్నారు. ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్ ప్రారంభమవుతుందని జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్, జిల్లా న్యాయాధికారి ఎం. నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇరుపక్షాల అంగీకారంతో వివాదాలకు సత్వర పరిష్కారం లభించే అవకాశం ఉండటంతో కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులకు వేగంగా పరిష్కారం చూపడమే లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశం. దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదాలను ఇరుపక్షాల సమ్మతితో ముగించుకునే అవకాశం ఉండటంతో కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. రాజీకి అవకాశం ఉన్న తమ కేసుల వివరాలను సంబంధిత న్యాయస్థానం లేదా న్యాయ సేవా సంస్థ ద్వారా తెలుసుకుని జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు కోరారు.



## చక్రిపురంలో రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

**కుషాయిగూడ, నేడు న్యూస్:** రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని చక్రిపురంలో జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను బొంతు శ్రీదేవి యాదవ్ పరిశీలించారు. చక్రిపురం ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లలో గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వినాయక విగ్రహాల తరలింపు, నిమజ్జన ఊరేగింపు సమయంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా రోడ్లను సిద్ధం చేయాలని సూచించారు. చక్రిపురంతో పాటు చర్లపల్లి, కుషాయిగూడ డివిజన్లలోని ప్రధాన రహదారులన్నింటినీ త్వరితగతిన మరమ్మత్తు చేస్తామని తెలిపారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

## ఓటర్ల జాబితాలో తప్పులకు తావివ్వొద్దు!



- హియరింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి
- ధ్రువీకరణ పత్రాల పరిశీలన పక్కాగా జరగాలి
- క్షేత్రస్థాయి అధికారులకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలు
- దేవరుప్పులలో ఓటర్ల నమోదు సరళి ఆకస్మిక తనిఖీ

**దేవరుప్పుల :** ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2026 ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మ్యాపింగ్ కాని, అనామలీస్ (లోపాలు) జాబితాలో ఉండి.. నోటీసులు అందుకున్న ఓటర్ల హియరింగ్ (విచారణ) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన దేవరుప్పుల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్‌లోడింగ్ తదితర ప్రక్రియలను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.

### పాత జాబితాతో సరిపోల్చుకోండి..

ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను కేవలం పైపైన కాకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఫారాలపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలన్నారు. ఏవైనా అనుమానాలు వస్తే.. వెంటనే 2002 నాటి పాత ఓటర్ల జాబితాను సైతం పరిశీలించి వివరాలను పక్కాగా సరిపోల్చుకోవాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ అప్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించిన ఆయన.. ప్రతిరోజూ ఎంత మంది ఓటర్లు హియరింగ్‌కు హాజరవుతున్నారు? ఎన్ని దరఖాస్తులను ధ్రువీకరిస్తున్నారు? తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

### అర్హులందరికీ ఓటు హక్కు..

నోటీసులు జారీ చేసిన ప్రతి ఒక్కరూ విచారణకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని కలెక్టర్ గుర్తుచేశారు. అర్హత కలిగిన ఏ ఒక్కరికీ ఓటు హక్కు దూరం కాకూడదని, అదే సమయంలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు, బోగస్ ఓట్లకు ఏమాత్రం ఆస్కారం లేకుండా తుది జాబితాను పక్కాగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది అంతా పరస్పర సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

### పారిశుద్ధ్య లోపాలపై అసహనం..

పంచాయతీ పరిధిలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను చూసి కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే వాటిని తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ఎంపీడీవో క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేనక, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె. రాజు, పంచాయతీ కార్యదర్శి సతీష్ రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

“

## నిరసన స్థలంలో పసుపు నీళ్లు చల్లడం దుర్మార్గం

**గుడిపూడి తిరుమలరావు**

**కారేపల్లి :** ఎర్ర వల్లిలో ప్రజాస్వామ్యబద్ధంగా డప్పులు కొట్టి నిరసన తెలిపిన ప్రదేశంలో అనంతరం పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడాన్ని కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమలరావు తీవ్రంగా ఖండించారు. నిరసన జరిగిన ప్రదేశాన్ని అపవిత్రమైనదిగా భావించేలా పసుపు నీళ్లు చల్లడం నిరసనకారులను అవమానించడమేనని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను, నిరసనలను శాంతియుతంగా వ్యక్తం చేసే హక్కు ఉందన్నారు. రాజకీయాల్లో విమర్శలు, నిరసనలు సహజమని, వాటికి రాజకీయంగానే సమాధానం చెప్పాలని సూచించారు. ఇలాంటి చర్యలతో ప్రజల మధ్య విభేదాలు పెంచడం సరికాదన్నారు. ఉసిరికాయలపల్లిలో రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రచ్చబండ లింగమ్మ తల్లి పచ్చిపాల చుక్కమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న గుడిపూడి తిరుమలరావు వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కుటుంబానికి అండగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.




## ఎస్సీ, ఎస్టీ బాధితులకు పెండింగ్ ఆర్థిక సహాయం వెంటనే అందించాలి

- మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సహాయాన్ని అర్హులకు చెల్లించాలి
- కేవీపీఎస్ ధర్నా.. కలెక్టర్‌కు వినతిపత్రం

**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు చట్ట ప్రకారం అందాల్సిన ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితుల ఆర్థిక సహాయాన్ని అర్హులైన వారికి తక్షణమే అందించాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సహాయాన్ని కూడా విడుదల చేయాలని కోరారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా అనంతరం కేవీపీఎస్ నాయకుల బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసింది. సమస్యలను పరిశీలించిన కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, వినతిలో పేర్కొన్న డిమాండ్లను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కేవీపీఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్, జిల్లా ఉపాధ్యక్షులు పాపిట్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు ఎస్.కె. సైదులు, మేడిబిక్షం, పగిడిపల్లి వెంకటరావు, ఏపూరి వరకుమార్, రాంబాబు, వెంకటేశ్వర్లు, గుర్రం మాధవరావు, ఐలపోగు రామనాథం, మహిళా సంఘం నాయకురాలు నందిపాటి పావని, వెంకన్న, సిద్దుల రాజు, శాంతయ్య, శ్రీను, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గణపతి ఉత్సవాలు ప్రశాంతంగా జరపాలి

**ఎస్పీ సునిత రెడ్డి**



**ఆర్గాన్ న్యూస్ ప్రతినిధి, వనపర్తి ,సెప్టెంబర్ 11:** వనపర్తి జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో సోదర భావంతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మండప నిర్వాహకులు, మత పెద్దలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి మండపం https://policeportal.tspolice.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మండపాల వద్ద సీసీటీవీలు ఏర్పాటు చేసి 24 గంటలు వాలంటీర్లు ఉండాలని, డీజేలకు అనుమతి లేదని, రాత్రి 10 గంటల వరకే స్పీకర్లు వాడాలని, సోషల్ మీడియా వదంతులు నమ్మవద్దని సూచించారు.



## దివ్యాంగులకు వెంటనే ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేయాలి

**మున్సిపల్ చైర్మన్, కమిషనర్లకు వినతి పత్రం అందజేత**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 11, ఆర్గాన్ న్యూస్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో స్థానికంగా నివాసం ఉంటున్న అర్హులైన దివ్యాంగులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలని కోరుతూ దివ్యాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థ ఉపాధ్యక్షులు మల్సూర్ స్థానిక మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ లకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘ వ్యవస్థ ఆధ్యక్షులు కత్తుల మల్సుర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సొంతిళ్లు లేక అద్దె ఇళ్లలో ఉంటూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శారీరక లోపాలతో ఉపాధి అవకాశాలు లేక సతమతమవుతున్న తమను మానవతా దృక్పథంతో అర్థం చేసుకుని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి దివ్యాంగులకు ఇంటి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల వినతి పత్రం స్వీకరించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ఈ సమస్యపై సానుకూలంగా స్పందించారు. అధికారులతో కిందిస్థాయిలో సర్వే చేయించి, అర్హుల జాబితాను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వీలైనంత త్వరగా అర్హులైన దివ్యాంగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు, ప్రతినిధులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.




## ఎస్‌జిఎఫ్ జోనల్ క్రీడల్లో మహబూబాబాద్ జట్ల హవా

**కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో పోటీలలో విజయం**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 11(ఆర్గాన్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి వేదికగా నిర్వహించిన 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి క్రీడా పోటీలు గురువారంతో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిశాయి. రెండు రోజుల పాటు సాగిన ఈ పోటీలలో మండల పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా ప్రధాన క్రీడాంశాలైన కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో విభాగాల్లో మహబూబాబాద్ మండల జట్లు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించి, విజేతలుగా నిలిచాయి కబడ్డీ, వాలీబాల్ మరియు ఖో-ఖో ఫైనల్ మ్యాచులలో మహబూబాబాద్ జట్లు ప్రత్యర్థి జట్లపై ఘన విజయాన్ని నమోదు చేశాయి. ఈ జోనల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేత జట్లతో పాటు అత్యుత్తమ క్రీడాకారులు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి ఎస్ జి ఎఫ్ పోటీలలో మహబూబాబాద్ జోన్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన గ్రామ సర్పంచ్ చీరిక వసంత ఉపేందర్ రెడ్డి, విద్యాశాఖ అధికారులు మరియు ఎఫ్ ఐ జి నిర్వహకులు విజేతలకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

## రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీపై ఉన్న శ్రద్ధ

# సాగునీటిపై లేదు

- శ్రీశైలంలో నీళ్లున్నా సాగునీరు అందించని వైనం
- రేవంత్ సర్కార్ అసమర్థ పాలనకు నిదర్శనం : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**ఆర్గాన్ న్యూస్ ప్రతినిధి, వనపర్తి, సెప్టెంబర్ 11:** శ్రీశైలం ప్రాజెక్టులో సమృద్ధిగా నీళ్లున్నా ఉమ్మడి పాలమూరు రైతులకు సాగుజలాలందించలేని అసమర్థ ప్రభుత్వమిదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. ఫ్యూచర్ సిటీపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని దుయ్యబట్టారు. రేవల్లి మండలం గౌరీదేవిపల్లి వద్ద మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల స్టేజ్-3 పంప్ హౌస్ ను మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ వానాకాలం మొదలు నుంచే ప్రభుత్వాన్ని అలర్ట్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. శ్రీశైలంలో 180 టీఎంసీలకు పైగా నీళ్లున్నా లేవని బుకాయిస్తున్నారని, ఏపీ రోజుకు 10-12 టీఎంసీల చొప్పున పోతిరెడ్డిపాడు నుంచి తరలించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కేఎల్ఐ పంపులకు డెడికేటెడ్ లైన్ ఉన్నా కరెంటు ఇవ్వకుండా దొంగల్లా నడుపుతోందని, పవర్ సప్లై లేక బేరింగ్ పోయి ఒక మోటారు రిపేర్ కు వచ్చిందన్నారు. కేఎల్ఐ పంపులు 24 గంటలు నడిపి రైతులకు సాగునీళ్లివ్వాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఏపీ అనధికారికంగా నీళ్లు తరలిస్తుంటే సీఎం, జిల్లా మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మేము వస్తున్నామని మోటార్లు ఆన్ చేశారని, పంటలు ఎండితే ప్రభుత్వానిదే బాధ్యతన్నారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులకు నీళ్లిచ్చే సోయి ప్రభుత్వానికి లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 33 నెలలుగా పెండింగ్ లో పెట్టారన్నారు. మర్రి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ 15 రోజుల్లో 70 టీఎంసీలు ఏపీకి వెళ్లాయని, కేఎల్ఐ మాకు అప్పజెప్తే మేమే నడుపుతామని వ్యాఖ్యానించారు. హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి రైతుల గొంతు కోస్తున్నారని, మోటార్లు ఆన్ చేయకుంటే పంప్ హౌస్ వద్ద టెంట్ వేసి కూర్చుంటామని హెచ్చరించారు.

ప్రత్యేకం



## ప్రజలకు కల్తీ లేని ఆహారం అందించండి మహాప్రభో!

- కల్తీ ఆహారంపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలి
- కొక్కరోకో విజ్ఞప్తి

**ఖమ్మం,ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** దేశ ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఆహార భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని కొక్కరోకో విజ్ఞప్తి చేసింది. ప్రజలు నిత్య జీవితంలో వినియోగించే ఆహార పదార్థాల్లో కల్తీ పెరుగుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంది. కల్తీ ఆహారం కారణంగా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని కొక్కరోకో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి భారతీయుడికి నాణ్యమైన, సురక్షితమైన, కల్తీ లేని ఆహారం అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేసింది. కల్తీకి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతను నిరంతరం తనిఖీ చేసే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే కల్తీ వ్యాపారానికి అడ్డుకట్ట వేసి, 'కల్తీ లేని ఆహారం--ప్రతి భారతీయుడి హక్కు' అనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని విజ్ఞప్తి చేసింది. 'ప్రజల ఆరోగ్యం దేశ ఆరోగ్యం. ప్రజలకు కల్తీ లేని ఆహారం అందించండి మహాప్రభో!' అని కొక్కరోకో ఫౌండర్-ఇన్-చీఫ్ పంతంగి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



## మట్టి విగ్రహాలను పూజించుదాం

**మున్సిపల్ చైర్మన్ జ్యోతి రమేష్**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 11, ఆర్గాన్ న్యూస్:** మట్టి విగ్రహాలనే పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి రమేష్, స్థానిక వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ వినోద్ మరియు ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ప్రజలకు ఉచితంగా మట్టి విగ్రహాలను అందజేసి, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కల్పించారు. రసాయన రంగులతో తయారుచేసిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల జల వనరులు కలుషితమవుతాయని.. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పురపాలక సంఘం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది." "మరి చూశారుగా.. మన సంస్కృతిని కాపాడుకుంటూనే, పర్యావరణానికి హాని కలగకుండా మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠిద్దాం. ప్రకృతిని కాపాడుకుందాం."

## వనపర్తి జిల్లాపై మూడో కన్ను

- 2,221 సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు
- జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి




**ఆర్గాన్ న్యూస్ ప్రతినిధి, వనపర్తి, సెప్టెంబర్ 11:** ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నేర నియంత్రణ, నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా కోసం వనపర్తి జిల్లా వ్యాప్తంగా 2,221 సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి తెలిపారు. డీజీపీ సి.వి.ఆనంద్ ఆదేశాల మేరకు ప్రత్యేక చొరవతో నేనుసైతం, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా దాతలు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధుల సహకారంతో 412 నూతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పాత కెమెరాలకు మరమ్మతులు చేయించి మొత్తం 2,221 కెమెరాలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రారంభించారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించడం వల్ల నేరాలు జరిగినప్పుడు ఆధారాల సేకరణ, నేరస్తుల గుర్తింపు, రోడ్డు ప్రమాదాలు, చోరీలు, అనుమానాస్పద కదలికలపై వేగంగా స్పందించడానికి ఉపయోగపడతాయని ఎస్పీ తెలిపారు. స్మార్ట్ పోలీసింగ్ - సేఫ్ వనపర్తి లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలు, వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, దాతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ఉద్యోగుల సమ్మె

**వారానికి ఐదు రోజుల పని దినాలు అమలుచేయాలని డిమాండ్**




**మహబూబాబాద్, సెప్టెంబర్ 11, ఆర్గాన్ న్యూస్:** పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బ్యాంకు ఉద్యోగులు సమ్మె బాట పట్టారు ,మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు ఒకరోజు సమ్మె నిర్వహించి నిరసన ర్యాలీ చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బ్యాంకింగ్ రంగంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారానికి ఐదు రోజుల పని దినాల విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బ్యాంకు ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రతినిధి సంతోష్ మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పీఎల్ఐ పథకం, స్కేల్-4, అంతకంటే పై స్థాయి కేడర్ అధికారుల కోసం తీసుకొచ్చిన పెర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ విధానంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో బ్యాంకులకు ఐదు రోజుల పనిదినాల విధానం అమల్లో ఉన్నప్పటికీ... దేశంలోని బ్యాంకు ఉద్యోగులకు మాత్రం ఆ విధానం అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే... సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే... అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇక బ్యాంకు ఉద్యోగులు ఒక్కరోజు సమ్మె నిర్వహించడంతో... ఆ తర్వాత రెండో శనివారం, ఆదివారం సాధారణ సెలవులు కాగా... సోమవారం వినాయక చవితి సందర్భంగా సెలవు ఉండటంతో వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఈ సమ్మెలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

## కంబాలపల్లి ఉపాధ్యాయులకు ఘన సన్మానం




**మహబూబాబాద్, సెప్టెంబర్ 11, ఆర్గాన్ న్యూస్:** ప్రాథమిక పాఠశాల కంబాలపల్లి లో ఈరోజు విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంచార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ మందుల శ్రీరాములుహామాట్లాడుతూ ఉపాధ్యాయులను విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు సన్మానించడంహాఉపాధ్యాయులకు గొప్ప వరమని ఇలాంటి అవకాశం కొందరికే దక్కుతుందని, ఆ అవకాశం వీరికి దక్కడం గొప్ప అదృష్టంగా భావించాలని అన్నారు. గ్రామంలో విద్యార్థిని విద్యార్థులకు చక్కని విద్యాభ్యాసాన్ని మరియు విద్యార్థులను సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తు వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులే ముందుకు వచ్చి ఉపాధ్యాయులను సన్మానించడం జరిగిందని వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఉపాధ్యాయులు అంకితభావంతోహాకృషి చేస్తున్నారని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాసరావు, జెడి అనసూయ, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, హార్టికల్చర్ అధికారి మరియన్న, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీమతి గిరిజ,హాతెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు కొలిశెట్టి సత్యనారాయణ, కంబాలపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఉప్పలయ్య, సన్మాన గ్రహీతలు ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి ఉపాధ్యాయులు ఆవునూరి రవి, ఆర్ రాధిక, సిహెచ్ శ్రీజ,హాకవిత, మమత మరియు విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు అచ్చ ప్రశాంత్, సందు సురేష్, కారింగుల రాజశేఖర్, లావణ్య , అబ్దుల్ హైమద్, పెద్ద మాముల నాగరాజు, విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## మట్టి వినాయక విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

**ఎస్ఐ బైరి గోపి**

**కారేపల్లి :** వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్వహించుకోవాలని ఎస్ఐ బైరి గోపి ప్రజలకు సూచించారు. వినాయక ఉత్సవాలు ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలవాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. వినాయక మండపాల నిర్వాహకులు విద్యుత్ కనెక్షన్లు, లైటింగ్ ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండపాల వద్ద రద్దీ సమయంలో చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్ఐ బైరి గోపి సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయన రంగులు, ఇతర పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు.




# తాతా మధు వ్యాఖ్యలపై ఖమ్మంలో భారీ నిరసన

### వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్

**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. సంజీవరెడ్డి భవన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జరిగిన ర్యాలీకి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. స్పీకర్ పదవి వ్యక్తికి సంబంధించినది కాదని, శాసనసభ, ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన రాజ్యాంగబద్ధమైన గౌరవప్రదమైన పదవని అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నా స్పీకర్ పదవి గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

#### ర్యాలీలో భారీగా పాల్గొన్న కేకేసి నాయకులు

అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసి ) నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగబద్ధ సంస్థల గౌరవాన్ని కాపాడటం ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యత అని కేకేసీ నాయకులు పేర్కొన్నారు. ర్యాలీలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖఖజ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విప్లవ్‌కుమార్ పటేల్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బొల్లిని నాగరాజు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు జంగిపల్లి ప్రసాద్, ఆటో యూనియన్ పార్లమెంట్ అధ్యక్షుడు మెరుగు వెంకట్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడగాని వేణుగౌడ్, ఎండీ గయాజ్ పాషా, త్రీటౌన్ అధ్యక్షుడు రాజు, మెహరాజ్, చారి శ్రీను, బాలకృష్ణ, నరసింహారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కొత్త క్రిమినల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11: ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది కొత్త క్రిమినల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి** ఉండాలని, చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. కొత్త క్రిమినల్ చట్టాలు--2023 అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సిటీ ఆర్మ్డ్ రిజర్వ్‌కు చెందిన 500 మంది అధికారులు, సిబ్బందికి గత వారం రోజులుగా సిటీ ట్రైనింగ్ సెంటర్ (సీటీసీ)లో సమగ్ర అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో భారతీయ న్యాయ సంహిత--2023 (బిఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత--2023 (బిఎన్ఎస్ఎస్ ), భారతీయ సాక్ష్య అధినియమం--2023 (బిఎన్ఎస్ )లోని కీలక నిబంధనలపై నిపుణులు అవగాహన కల్పించారు. కొత్త చట్టాల ప్రకారం కేసుల నమోదు, దర్యాప్తు విధానం, సాక్ష్యాల సేకరణ, డిజిటల్, ఎలక్ట్రానిక్ సాక్ష్యాల ప్రాధాన్యత, బాధితుల హక్కులు, అరెస్టు--రిమాండ్ ప్రక్రియ, కోర్టు విచారణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

#### శాస్త్రీయ దర్యాప్తుపై ప్రత్యేక శిక్షణ

కొత్త చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తును మరింత శాస్త్రీయంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చట్టాల అమలులో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీటీసీ ఏసీపీ హరినాథ్ బాబు, ఆర్ఐ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు ఎల్ఐజీ స్కీమ్ వర్తింపజేయాలి

- హౌసింగ్ టవర్లు నిర్మించి 2బీహెచ్‌కే ఫ్లాట్లు ఇవ్వాలి
- ఖమ్మం ప్రెస్‌క్లబ్‌పై విచారణ పూర్తి చేసి ఎన్నికలు నిర్వహించాలి

**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించడంతో పాటు ఖమ్మం ప్రెస్‌క్లబ్ ఎన్నికలను వెంటనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ఖమ్మం జిల్లా ప్రతినిధులు శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో అమలు చేస్తున్న ఎల్ఐజీ (లో ఇన్‌కమ్ గ్రూప్) హౌసింగ్ స్కీమ్‌ను జర్నలిస్టులకు కూడా వర్తింపజేయాలని వారు కోరారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా హౌసింగ్ టవర్లు నిర్మించి, ఒక్కో జర్నలిస్టుకు సుమారు 1,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో 2బీహెచ్‌కే ఫ్లాట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అది సాధ్యం కాని పక్షంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు 200 గజాల ఇంటి స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వరరావు (ఎన్.ఎస్.రావు), జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కో-కన్వీనర్ ఎం.ఏ. అన్సార్ పాషా, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ, ప్రెస్‌క్లబ్ ఇన్‌చార్జి కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు జాబిశెట్టి కుటుంబరావు, ఏనిగండ్ల శ్రీనివాసరావు, బొడ్డుపల్లి రవీందర్, పసుపులేటి ఉపేందర్ తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని హామీ ఇచ్చినట్లు డబ్ల్యూజేఐ ప్రతినిధులు తెలిపారు. అదేవిధంగా ఖమ్మం ప్రెస్‌క్లబ్ ఎన్నికల నిర్వహణ అంశంపై కూడా కలెక్టర్‌తో ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. చాలా కాలంగా ప్రెస్‌క్లబ్‌కు ఎన్నికలు జరగడం లేదని, ప్రస్తుతం క్లబ్ నిర్వహణపై కొనసాగుతున్న విచారణను త్వరగా పూర్తి చేసి ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

# గ్రానైట్ క్వారీల్లో 'సెటిల్‌మెంట్' గుట్టు?

### రూ.2 లక్షల లంచంతో సిబిఐ వలలో మైనింగ్ అధికారి

**ఒంగోలు/చీమకుర్తి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** ప్రకాశం జిల్లా గ్రానైట్ క్వారీల్లో లంచం వ్యవహారం కలకలం రేపుతోంది. క్వారీలో జరిగిన ప్రమాదంపై యాజమాన్యానికి అనుకూలంగా నివేదిక ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై డీజీఎంఎస్ డిప్యూటీ డైరెక్టర్ యు. శివశంకర్‌ను రూ.2 లక్షల నగదుతో సిబిఐ అధికారులు ట్రాప్ చేసి అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో కన్సల్టెంట్/మధ్యవర్తి, ఓ ప్రైవేట్ మైనింగ్ సంస్థ ప్రతినిధిని కూడా అరెస్ట్ చేసినట్లు సిబిఐ పేర్కొంది. సిబిఐ వివరాల ప్రకారం.. 2026 జూన్ 25న ప్రకాశం జిల్లాలోని ఓ గ్రానైట్ క్వారీలో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంపై యాజమాన్యానికి అనుకూలంగా నివేదిక ఇప్పించేందుకు మధ్యవర్తి ద్వారా అధికారిని సంప్రదించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ముందుగా రూ.1 లక్ష చెల్లించడంతో పాటు, అనంతరం మరో రూ.2 లక్షలు ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది. ఆగస్టు 17న ఒంగోలులో రూ.2 లక్షలు అందుకుంటున్న సమయంలో అధికారి సిబిఐ వలలో చిక్కినట్లు తెలిపింది. ఈ కేసులో ఇతర గనులకు సంబంధించిన 'త్రైమాసిక చెల్లింపుల' ఆరోపణలు కూడా ఉన్నట్లు సిబిఐ పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. ప్రమాద నివేదికకు సంబంధించిన లంచానికే ఈ వ్యవహారం పరిమితమా? లేక మరిన్ని క్వారీలకు సంబంధం ఉందా? అన్న అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

#### సోదాలతో మరిన్ని లింకులపై ఆరా

అరెస్టుల అనంతరం ఒంగోలు, కడప, హైదరాబాద్ ప్రాంతాల్లో నిందితులకు సంబంధించిన ప్రదేశాల్లో సిబిఐ సోదాలు



నిర్వహించినట్లు తెలిపింది. క్వారీల తనిఖీ నివేదికలు, ప్రమాదానికి సంబంధించిన పత్రాలు, ఆర్థిక లావాదేవీలు, ఎలక్ట్రానిక్ ఆధారాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. చీమకుర్తి, బల్లికురవ ప్రాంతాల్లో గ్రానైట్ క్వారీల తనిఖీలు, ప్రమాద నివేదికలు, అధికారుల వ్యవహారశైలిపై కూడా దర్యాప్తులో పరిశీలన జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా జూన్ 25 ప్రమాదానికి సంబంధించిన నివేదికలో ఏమైనా మార్పులు జరిగాయా? లంచం వెనుక మరెవరైనా ఉన్నారా? అనే అంశాలు కీలకంగా మారాయి. సిబిఐ నమోదు చేసిన కేసులోని ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది. అయితే రూ.2 లక్షల ట్రాప్‌తో ఈ వ్యవహారం ముగుస్తుందా? లేక గ్రానైట్ క్వారీల్లో మరింత విస్తృతమైన లంచాల వ్యవస్థ వెలుగులోకి వస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సీఎంఓలో 'అధిపత్య' సమరం!?

- ఇద్దరు ఐఏఎస్‌ల చుట్టూ అధికార యంత్రాంగంలో వర్గపోరు చర్చ!
- కీలక పోస్టింగులు.. రాజకీయ ముద్రలు.. ప్రభుత్వ ప్రతిష్టపై పెరుగుతున్న ప్రశ్నలు
- శాఖల కార్యదర్శులు, కలెక్టర్ల నియామకాలపై కొత్త ప్రశ్నలు

**అమరావతి,సెప్టెంబర్ 11,ఆర్గాన్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనా వర్గాల్లో సీఎంఓ కేంద్రంగా జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. సీఎంఓలో కీలకంగా వ్యవహరిస్తున్న ఇద్దరు ఐఏఎస్ అధికారుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోందన్న ప్రచారం నేపథ్యంలో శాఖల కార్యదర్శులు, జిల్లాల కలెక్టర్లు కూడా రెండు వర్గాలుగా విడిపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలు ప్రభుత్వ ప్రతిష్టపై ప్రభావం చూపుతున్నాయన్న అభిప్రాయాలు అధికార వర్గాల్లో వ్యక్తమవుతు న్నాయి. సీఎంఓకు చెందిన ప్రద్యుమ్న, కార్తికేయ మిశ్రా మధ్య విభేదాలు ఉన్నాయంటూ గతంలో మీడియాలో కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ కథనాల్లోని ఆరోపణలకు స్వతంత్ర నిర్ధారణ అవసరం ఉంది. వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరు ప్రభుత్వ యంత్రాంగంపై ప్రభావం చూపుతోందన్న చర్చ మాత్రం సచివాలయ వర్గాల్లో కొనసాగుతున్నట్లు సమాచారం.

#### నియామకాలపై రాజకీయ ముద్రల చర్చ

ప్రద్యుమ్నకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మద్దతు ఉందని, కార్తికేయ మిశ్రాకు మంత్రి నారా లోకేష్ అండదండలు ఉన్నాయని సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ ప్రచారాన్ని అధికారికంగా ధృవీకరించే ఆధారాలు లేవు. ఇదే సమయంలో కీలక శాఖలు, జిల్లాల పోస్టింగుల్లో ఎవరి ప్రభావం ఎక్కువగా ఉందన్న చర్చ కూడా సాగుతోంది. తమకు అనుకూలంగా వ్యవహరించే అధికారులకు ప్రాధాన్యత లభిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, ఆ ఆరోపణలను నిర్ధారించే అధికారిక సమాచారం బయటకు రాలేదు.

#### వైసీపీ ముద్రపై చర్చ.. ప్రభుత్వానికి ఇబ్బందేనా?

ప్రద్యుమ్నపై గత వైసీపీ ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలున్నాయన్న రాజకీయ విమర్శలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఆయన కీలక శాఖల్లో పనిచేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ టీడీపీ వర్గాల్లో ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అదే సమయంలో కార్తికేయ మిశ్రాపైనా రాజకీయ అనుబంధాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, సీఎంఓలో పనిచేస్తున్న అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని అధికార వర్గాల్లోనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తిగత లేదా రాజకీయ అనుబంధాల కంటే పరిపాలనా సామర్థ్యం, పారదర్శకత, ప్రభుత్వ విధానాల అమలుకే ప్రాధాన్యం ఉండాలని పలువురు సూచిస్తున్నారు. మొత్తంగా ఇద్దరు అధికారుల మధ్య ఆధిపత్య పోరు ఉందన్న ప్రచారం నిజమా? శాఖల కార్యదర్శులు, కలెక్టర్ల స్థాయిలో వర్గపోరు ఏర్పడిందా? కీలక నియామకాల్లో వ్యక్తిగత ప్రభావం పనిచేస్తోందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ, అధికార వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. ఈ అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**మంగపేట, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను మంగపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగపేట మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. మండల విద్యాధికారిణి పొడెం మేనక అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులకు గజమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. అనంతరం జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ముఖ్య అతిథిగా మంగపేట తహసీల్దార్ తోట రవీందర్ హాజరయ్యారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా గుర్తించి సన్మానించారు. సన్మాన గ్రహీతలుగా స్వర్ణపాక సురేందర్ (స్కూల్ అసిస్టెంట్--తెలుగు, కొత్తపేటగూడెం), ధనసరి విజయకుమారి (ఎస్‌జీటీ, చుంచుపల్లి), కొక్కుల నాగలక్ష్మి (స్కూల్ అసిస్టెంట్--హిందీ, కమలాపూర్), తల్లడి జోస్నేశ్వరరావు (ఎస్‌జీటీ, కోమటిపల్లి), తేజావత్ సూక్య (ఎస్‌జీటీ, నరసింహసాగర్), చీరాల సత్యనారాయణ (స్కూల్ అసిస్టెంట్--ఫిజికల్ సైన్స్, తిమ్మంపేట), చింత సమ్మయ్య (స్కూల్ అసిస్టెంట్--బయోసైన్స్, టీడబ్ల్యూహెచ్ఎస్, బ్రాహ్మణపల్లి), ఆజ్మీరా



రాజేందర్ (ఎస్‌జీటీ, బ్రాహ్మణపల్లి), చాపల శృతి (సీఆర్‌టీ--గణితం, మంగపేట), చింత రమేష్ (పీ.ఈ.టీ, తిమ్మంపేట) ఉన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గడ్డి శ్రీనివాస్, కొంపెల్లి భిక్షం గౌడ్, తొండెపు శ్రీలక్ష్మి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పాయం భాగ్యలక్ష్మి, యూనియన్ నాయకులు, పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందా భద్రయ్య, మద్దెల నాగేశ్వరరావు, యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండం పురుషోత్తం, మాలోతు రాజు, జబ్బ రవి, కే. మాధవరావు, చందా రఘుపతి, వజ్జా విష్ణుమూర్తి తదితరులతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చందుపట్లలో ఘనంగా ఉచిత మెగా వైద్య శిబిరం

**రంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** యాదాద్రి భువనగిరి జిల్లా చందుపట్ల గ్రామంలో దివంగత సందుపట్ల రాంగోపాల్రావు జయంతి చందుపట్ల నరసింహారావు జ్ఞాపకార్థం చందుపట్ల సుజిత్ రావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ మెగా మెడికల్ శిబిరంలో కిడ్నీ బీపీ షుగర్ వ్యాధులు ఎప్పుడు డాక్టర్ శ్రీనివాస్ నాయక్, నేత్ర వైద్యులు డాక్టర్ పెద్ది సంతోష్ డాక్టర్ స్రవంతి పాల్గొని దాదాపు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు అనంతరం బాధితులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్రావు కుమారులు చందుపట్ల వెంకటేశ్వరరావు చందుపట్ల రాజేశ్వరరావు చందుపట్ల లక్ష్మీనారాయణ రావు చందుపట్ల విశ్వేశ్వరరావు గ్రామ సర్పంచ్



కంకాల కృష్ణయ్య గ్రామస్తులు చిన్నం ప్రభాకర్ వెంకటేష్, బీరప్ప మధు తగలపల్లి శ్రీకాంత్ మచ్చ చక్రవర్తి సంతోష్ రావు తుంగతుర్తి మండవ మహేష్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతే రాజు అనే దిశగా ప్రభుత్వం ముందడుగు

- వ్యవసాయ పరికరాల కొనుగోలులో రైతులకు పూర్తి స్వేచ్ఛ
- నేరుగా రైతు ఖాతాల్లోకే సబ్సిడీ..
- ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రణాళిక



**ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** రైతే రాజు అనే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని వ్యవసాయ, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గతంలో ఉన్న నిబంధనల్లో మార్పులు తీసుకువస్తూ వ్యవసాయ పరికరాల కొనుగోలులో రైతులకు పూర్తి స్వేచ్ఛ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు నచ్చిన కంపెనీకి చెందిన నాణ్యమైన వ్యవసాయ పరికరాలను, తమకు అనుకూలమైన ధరకు కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఎంపానెల్‌మెంట్ కమిటీల్లో సైంటిస్టులు, టెక్నికల్ ఇంజినీర్లతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, ఆదర్శ రైతులను సభ్యులుగా చేర్చినట్లు వెల్లడించారు. వ్యవసాయ పరికరాల కొనుగోలు వివరాలను అప్‌లోడ్ చేసిన వెంటనే డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని తుమ్మల తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.5 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని, రాబోయే మూడేళ్లలో మరో 6 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ సాగును విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. రైతులకు ప్రపంచ స్థాయి వ్యవసాయ పరికరాలను సైతం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.




# కూసుమంచిలో విద్యుత్ కోతలపై రైతుల ధర్నా

- రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి
- పెండింగ్ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి

**కూసుమంచి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** కూసుమంచి మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలను వెంటనే ఎత్తివేసి, రైతాంగానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో కూసుమంచి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మంత్రి పీఏ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి మరో వినతిపత్రం అందించారు. ఈ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి రైతులకు కనీసం 12 గంటలపాటు నిరంతర విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. రైతుల పంటలకు అవసరమైన సమయంలో విద్యుత్ కోతలు విధించడం వల్ల సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. అప్రకటిత కోతలను నివారించి వ్యవసాయానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



# తెలంగాణ సాయుధ పోరాట యోధులకు ఘన నివాళులు

- సీపీఎం పోలేపల్లి గ్రామ శాఖ ఆధ్వర్యంలో పోరాట వారోత్సవాలు
- యోధుల త్యాగాలను స్మరించుకున్న నాయకులు, గ్రామస్తులు

**ఖమ్మం రూరల్ , ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సీపీఎం పోలేపల్లి గ్రామ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పోలేపల్లి, గొల్లపాడు గ్రామాలకు చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ మద్ది సంగిరెడ్డి, గుడిగొండ చంద్రం, గడ్డమీది పుల్లయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఎం మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు హాజరై యోధుల పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో యోధులు చేసిన త్యాగాలు, ప్రజల కోసం సాగించిన పోరాటాలను ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి దండగల రాంబాబు, సీనియర్ నాయకులు మద్ది వెంకటరెడ్డి, సభ్యులు మొక్క నాగేశ్వరరావు, గుడిపాటి ఉదయ్ కుమార్, ఎరుకల వీరభద్రం, కొండం రామారావుతో పాటు గ్రామస్తులు చల్ల వెంకటేశ్వర్లు, బత్తుల లక్ష్మణ్, బత్తుల గణేష్, దండగల భద్రయ్య, బత్తుల కౌశల్య తదితరులు పాల్గొన్నారు.



# మట్టి గణపతిలోనే ముక్తి మార్గం

### వనపర్తి పురపాలక సంఘం

**ఆర్గాన్ న్యూస్ ప్రతినిధి, వనపర్తి, సెప్టెంబర్ 11:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి పురపాలక సంఘం ఆధ్యాత్మిక, పర్యావరణ స్పృహను చాటింది. శుక్రవారం మునిసిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్ నేతృత్వంలో పుర కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మట్టిలో పుట్టి మట్టిలో కలిసే గణనాథుడే జీవన సత్యానికి ప్రతీక అని, ప్రకృతిని కాపాడుతూ భక్తిని చాటుకోవడమే నిజమైన పూజ అని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జి. మధుసూదన్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ బి. నిరంజన్, కౌన్సిలర్లు, మేనేజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి

**జిల్లా అధ్యక్షుడు సూరపనేని నాగేశ్వరరావు పిలుపు**

**వెంకటాపురం (నూగూరు), ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** కమ్మ సేవా సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని శ్రీ గణపతిదేవ కాకతీయ కమ్మ సేవా సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు సూరపనేని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండల కేంద్రంలో శుక్రవారం శ్రీ గణపతిదేవ కాకతీయ కమ్మ సేవా సంఘం ములుగు జిల్లా త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఆత్మకూరి పట్టాభిరామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సూరపనేని నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. సంఘాన్ని మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు కమ్మ కుటుంబ సభ్యులందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా శాశ్వత సభ్యత్వాల నమోదు, జిల్లా స్థాయిలో కార్తీక మాస వనభోజనాల నిర్వహణ, 2027 సంవత్సర డైరీల రూపకల్పన తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. సంఘం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ సభ్యులందరినీ భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యదేవర కిషోర్‌కుమార్, ఆచంట ప్రసాద్, జిల్లా ప్రచార కార్యదర్శి కొత్త గోపాలరావు, జిల్లా సహాయ కార్యదర్శి అట్లూరి రఘురాం, జిల్లా కమిటీ సభ్యులు గూడవల్లి శ్రీహరి, నంబూరి రాజేందర్, ముప్ప భానుప్రకాష్, జాగర్లమూడి నాగేశ్వరరావు, ఆత్మకూరి పట్టాభిరామారావుతో పాటు వెంకటాపురం మండల కమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## బ్రాహ్మణ సువాసినులకు పసుపు కుంకుమ చీర తాంబూలం

- శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ఘనంగా కార్యక్రమం
- 135 మంది మహిళలకు చీరలు, పసుపు కుంకుమ, తాంబూలం పంపిణీ

**ఖమ్మం,ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ఖమ్మం మామిళ్లగూడెంలోని గాయత్రీ భవన్‌లో బ్రాహ్మణ సువాసినులకు పసుపు కుంకుమ, చీర, తాంబూలం అందించే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్లోబల్ బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో శ్రీ కళ్లే గిరిప్రసాద్ శర్మ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా శ్రీమతి డాక్టర్ వనం కృష్ణవేణి, అడ్వకేట్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వ్యవహరించారు. ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 135 మంది బ్రాహ్మణ సువాసినిలు కార్యక్రమంలో పాల్గొని పసుపు కుంకుమ, పూలు, తాంబూలంతో పాటు చీరలను స్వీకరించారు. గ్లోబల్ బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ కళ్లే గిరిప్రసాద్ శర్మ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఆగస్టు 16న హైదరాబాద్‌లో సుమారు 1,200 మంది బ్రాహ్మణ సువాసినులకు ఇదే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హైదరాబాద్‌కు రావడం సాధ్యం కానందున జిల్లా ముఖ్యనగరాల్లోనే కార్యక్రమాలను నిర్వహించేలా ముందస్తుగా లింక్ ద్వారా రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న ఖమ్మం జిల్లాకు చెందిన సుమారు 135 మంది బ్రాహ్మణ సోదరీమణులకు శ్రావణ మాసం ముగింపు సందర్భంగా చీర, పసుపు కుంకుమ, తాంబూలం అందించి సోదరభావంతో గౌరవించారు. మహిళలను తన ఇంటి ఆడబిడ్డలుగా భావించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తనను సమన్వయకర్తగా ఎంపిక చేయడం, ఇంతమంది సువాసినిల ఆశీర్వాదాలను పొందే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని డాక్టర్ వనం కృష్ణవేణి ఆనందం వ్యక్తం చేశారు. మహిళల ఆధ్యాత్మిక, సామాజిక ఐక్యతకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో మంత్రిప్రగడ జగన్మోహనరావు, పరిమి అనంతలక్ష్మి, ఆర్తిక్య సరస్వతి కుమార్, దేవులపల్లి నరసింహారావు, తుంగతుర్తి అనిల్‌కుమార్, మాదిరాజు జ్వాలేంద్రకుమార్, జలగం సతీష్, చైతన్య కిషోర్ శర్మ, కాందూరు లక్ష్మీసావిత్రి, నాగులపాటి తేజశ్రీ, సోమరాజు శ్రీదేవి, ఊటుకూరు శ్యామల తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనానికి బోయిన్ చెరువు సిద్ధం

**సికింద్రాబాద్:** వినాయక నిమజ్జనాలకు హస్మత్‌పేట్ బోయిన్ చెరువు ముస్తాబవుతోంది. ఈ నెల 14 నుంచి 24 వరకు జరగనున్న నిమజ్జనాలను దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏడాది వెయ్యికి పైగా వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రాంతం కావడంతో అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. చెరువు కట్టపై హైమాస్ట్ లైట్లు, విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతంలో షెడ్లు, మరుగుదొడ్లు, పోలీస్ కంట్రోల్ రూమ్, హెల్త్ సెంటర్ తదితర సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారు. త్వరలో నాలుగు భారీ క్రేన్లను ఏర్పాటు చేసి విగ్రహాల నిమజ్జనం వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు.

# సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలి

- సర్పంచులు-అధికారులు సమన్వయంతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు



**ఏటూరునాగారం, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పథకాలపై సరైన అవగాహన లేక అర్హత ఉన్న పలువురు లబ్ధి పొందలేక పోతున్నారని, ఈ పరిస్థితిని నివారించేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని రఘు సూచించారు. ముఖ్యంగా వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని అన్నారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా ప్రభుత్వానికి, అధికారులకు మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేసి తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని చిటమట రఘు పిలుపునిచ్చారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ (డీఆర్‌డీఏ), తహసీల్దార్, ఏటూరునాగారం డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కర్ల అరుణ, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులను అవమానించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- గిరిజన చట్టాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణలు
- మంగపేట మండల ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్



**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 11:** భారత రాజ్యాంగం ఆదివాసీ గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలను అవమానిస్తూ, గిరిజనులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మంగపేట మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన మాటూరి ఏడుకొండలుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం--1989 కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మంగపేట మండల ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. రమణక్కపేటకు చెందిన వాట్సాప్ గ్రూపుల్లో ఈ నెల 9న రాత్రి 11.49 గంటల సమయంలో మాటూరి ఏడుకొండలు గిరిజనులను, గిరిజన చట్టాలను దూషిస్తూ, అవమానకరమైన పదజాలంతో వ్యాఖ్యలు చేసినట్లు జేఏసీ నాయకులు ఆరోపించారు. ముఖ్యంగా 1/70 చట్టాన్ని, గిరిజనులను కించపరిచేలా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు.

### పోలీసులకు ఫిర్యాదు

సోషల్ మీడియా వేదికగా గిరిజన హక్కులు, చట్టాలను అవమానించడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. ఈ వ్యవహారంపై మంగపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సైని కలిసి మాటూరి ఏడుకొండలుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భారత రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కులు, ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న చట్టాలను ఎవరైనా ఉల్లంఘించినా, అవమానించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆదివాసీ జేఏసీ నాయకులు హెచ్చరించారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడేలా పోలీసులు వెంటనే స్పందించి, ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు నల్లెబోయిన లక్ష్మణ్ దొర, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎట్టి సారయ్య దొర, ములుగు డివిజన్ ప్రధాన కార్యదర్శి పొదెం నాగేష్, మన్యసీమ పరిరక్షణ సమితి నాయకులు, డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు, మన్యసీమ జిల్లా నాయకులు తోలేం సుధాకర్, ఆక తిరుమలరావు, విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక లక్ష్మణ్, తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి కురుసం రమేష్, డబ్బుల ముత్యాలరావు, పేసా జిల్లా అధ్యక్షుడు, పేసా మంగపేట మండల అధ్యక్షుడు జొగ నరేందర్, తుడుం దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు పునెం ప్రశాంత్, నాయకులు తోలేం రామకృష్ణ, కొరెం మొగిలి, గట్టుపల్లి అర్జున్, పోలేబోయిన సుధాకర్, పోలేబోయిన నాగార్జున్, కొమరం చంటి, ఈసాల భాగ్యరాజ్, కొమరం సందీప్, పోలేబోయిన వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల అభివృద్ధికి మరో ముందడుగు

- గ్రామపంచాయతీ జనరల్ ఫండ్ కోసం ఎస్‌టిఓకు వెళ్లకుండా చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర గ్రామ పంచాయతి రాజ్ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కి పాలభిషేకం



**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్,సెప్టెంబర్ 11:** ములుగు జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ వద్ద గ్రామపంచాయతీల జనరల్ ఫండ్‌ను ఎస్ స్టి వో (ట్రెజరీ) ద్వారా వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా డ్రా చేసుకునే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చిత్రపటాలకు ములుగు జిల్లా సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ములుగు జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్ ముప్పెపల్లి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీల అభివృద్ధికి కీలకమైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్కకి సర్పంచుల ఫోరం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కుమార్ గౌడ్ మాట్లాడుతూ గతంలో జనరల్ ఫండ్‌ను వినియోగించుకోవడానికి ఏ ష్టి వో ద్వారా వెళ్లాల్సి రావడంతో ప్రక్రియ ఆలస్యం అయ్యేది. దీంతో గ్రామాల్లో అత్యవసరమైన పారిశుద్ధ్యం మౌలిక వసతులు అభివృద్ధి పనులు సకాలంలో చేపట్టేందుకు ఇబ్బందులు ఎదు-రయ్యేవి. ప్రస్తుతం గ్రామపంచాయతీల అవసరాలకు అనుగుణంగా నిధులను వేగంగా సకాలంలో వినియోగించుకునే అవకాశం కల్పించడం ఎంతో కీలకమైన నిర్ణయం. ఇది గ్రామీణ అభివృద్ధికి వేగం తీసుకురావడంతో పాటు సర్పంచులకు పరిపాలనా పరంగా మరింత వెసులుబాటు కల్పిస్తుంది. సర్పంచుల సమస్యలను గుర్తించి గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్కకి ములుగు జిల్లా సర్పంచుల ఫోరం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో దేవగిరి పట్నం సర్పంచ్ ధరావత్ పూలమ్మ సర్వాపూర్ సర్పంచ్ ఇక కుమార్ అంకన్న గూడెం సర్పంచ్ రాజు కొత్తూరు సర్పంచ్ గట్టు సుదర్శన్ బంజరుపల్లి సర్పంచ్ రఘు మదనపల్లి సర్పంచ్ కరుణాసాగర్ పత్తిపల్లి సర్పంచ్ జగ్గన్నపేట సర్పంచ్ సారయ్య తదితర గ్రామాల సర్పంచులు పాల్గొన్ని ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రి సీతక్క కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## యోగాతో ఏకాగ్రత

**విద్యార్థులకు యోగా, ధ్యానంపై అవగాహన**




**బోనకల్, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 10:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నళినిశ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈషా ఫౌండేషన్ యోగా శిక్షకురాలు కుమారి కొప్పుల పూజిత పాల్గొని విద్యార్థులకు యోగా, ధ్యానంపై అవగాహన కల్పించారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత కూడా పెరుగుతుందని పూజిత తెలిపారు. కోపం, బాధ, సంతోషం వంటి వివిధ భావోద్వేగాలను నియంత్రించుకోవడంలో యోగా, ధ్యానం ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. అనంతరం విద్యార్థులతో వివిధ యోగాసనాలు వేయించి, వాటి ప్రయోజనాలను వివరించారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా మెదడు పనితీరు మెరుగుపడి చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని మంచి ఆరోగ్యంతో పాటు చదువులోనూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ నళినిశ్రీ సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అంతోటి తిరుపతిరావు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 13న ఖమ్మంలో జనసేన ‘తెలంగాణ రాష్ట్ర శంఖారావం’

**సభా ప్రాంగణానికి ‘వనజీవి రామయ్య ప్రాంగణం’గా నామకరణం**

**కేబుల్ బ్రిడ్జికి ‘వనజీవి రామయ్య వారధి’గా పేరు పెట్టాలని డిమాండ్**

**ఖమ్మం,సెప్టెంబర్ 11,ఆర్గాన్ న్యూస్:** ఖమ్మం నగర వేదికగా ఈ నెల 13న నిర్వహించనున్న జనసేన పార్టీ ‘తెలంగాణ రాష్ట్ర శంఖారావం’ సభను విజయవంతం చేయాలని ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జనసేన పార్టీ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. గడల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం కాల్వొడ్డులోని ఎంబీ గార్డెన్స్‌లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన లంచ్ మీట్‌లో ఆయన మాట్లాడారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్, తెలంగాణ ప్రచార కార్యదర్శి రాక్ సాగర్‌తో పాటు పార్టీ తెలంగాణ అగ్ర నాయకులు ఈ సభకు హాజరుకానున్నట్లు గడల శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ఈ సభ ద్వారా ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

### వనజీవి రామయ్యకు ఘన నివాళి

పర్యావరణ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసి, కోట్లాది మొక్కలు నాటి ఖమ్మం జిల్లాకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన పద్మశ్రీ వనజీవి రామయ్య సేవలను స్మరించుకునేలా సభా ప్రాంగణానికి ‘వనజీవి రామయ్య ప్రాంగణం’గా నామకరణం చేస్తున్నట్లు గడల ప్రకటించారు. అదేవిధంగా ఖమ్మం నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కేబుల్ బ్రిడ్జికి ‘వనజీవి రామయ్య వారధి’గా ప్రభుత్వం తక్షణమే నామకరణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణకు రామయ్య చేసిన సేవలకు ఇది సముచిత గౌరవం అవుతుందని పేర్కొన్నారు.

### ముగ్గురు మంత్రులపై తీవ్ర విమర్శలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రుల పనితీరు నిరాశాజనకంగా ఉందని డా. గడల శ్రీనివాసరావు విమర్శించారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అధికారం ఉన్నప్పటికీ జిల్లా సమగ్ర అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు.

### పట్టభద్రుల హక్కుల కోసం పోరాటం

నిరుద్యోగ యువత, ఉద్యోగులు, పట్టభద్రుల హక్కుల పరిరక్షణే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని గడల శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజల సమస్యలను బలంగా వినిపించే నిజమైన ప్రజా గొంతుకగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ‘తెలంగాణ రాష్ట్ర శంఖారావం’ సభ ద్వారా పార్టీ భవిష్యత్ కార్యాచరణను ప్రజలకు వివరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు రాము యాదవ్, ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ మిర్యాల రామకృష్ణ, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి నరేష్, జిల్లా నాయకులు, వివిధ విభాగాల నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.




## బాలికల ఆరోగ్యమే.. సమాజ ప్రగతికి పునాది!

- మెన్స్ట్రువల్ హైజీపై విద్యార్థినులకు అవగాహన
- బేటీ బచావో--బేటీ పడావోలో భాగంగా కుసుమంచి జేసీజీ పాఠశాలలో కార్యక్రమం

**కూసుమంచి /ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 11, ఆర్గాన్ న్యూస్:** బాలికల ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం, విద్య, భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా బేటీ బచావో--బేటీ పడావో (బీబీబీపీ ) కార్యక్రమంలో భాగంగా మెన్స్ట్రువల్ హైజీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీజీఎస్డబ్ల్యూఆర్ ఈఐఎస్ --జేసీజీ , కుసుమంచి అట్ మద్దులపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు రుతుస్రావం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించారు. రుతుస్రావం బాలికల్లో సహజంగా జరిగే శారీరక ప్రక్రియ అని, దీనిపై అపోహలు, భయాలు, సంకోచాలు అవసరం లేదని కార్యక్రమంలో వివరించారు. రుతుస్రావ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, శానిటరీ న్యాప్‌కిన్లను సక్రమంగా వినియోగించడం, నిర్ణీత వ్యవధిలో వాటిని మార్చడం, ఉపయోగించిన న్యాప్‌కిన్లను సురక్షితంగా, పరిశుభ్రంగా పారవేయడం వంటి అంశాలను వివరించారు. చేతులను శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన నీటిని వినియోగించడం ద్వారా పలు ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు.


### రక్తహీనతకు చెక్.. పోషకాహారమే రక్షణ

బాలికలు రక్తహీనతకు గురికాకుండా ఐరన్, ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు. రుతుస్రావ సమయంలో తీవ్రమైన కడుపునొప్పి, అధిక రక్తస్రావం, ఎక్కువ రోజులు కొనసాగడం లేదా ఇతర అసాధారణ ఆరోగ్య సమస్యలు ఎదురైతే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. రుతుస్రావం కారణంగా బాలికలు పాఠశాలకు దూరం కాకుండా వారి విద్య నిరంతరాయంగా కొనసాగేందుకు కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, సమాజం సహకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బాలికల ఆరోగ్యం, విద్య, భద్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయవచ్చని అధికారులు తెలిపారు. మెన్స్ట్రువల్ హైజీపై బాలికలతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లోనూ అవగాహన పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీమతి అపూర్వ మండా, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఏ. ప్రమీల, టీజీఎస్డబ్ల్యూఆర్ ఈఐఎస్ --జేసీజీ కుసుమంచి అట్ మద్దులపల్లి ప్రిన్సిపాల్ శ్రీమతి కె. శ్రీలత, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీమతి కనకదుర్గ, షీ టీమ్ సభ్యులు, డిహెచ్ ఈడబ్ల్యూ, డిఎంసీ , సత్రీమన్, ప్రమీల, ఆర్. వాసంతి, కె. సతీష్, డిహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఏడబ్ల్యూటీ లు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# బరువును అదుపులో పెట్టుకోవటం పెద్ద కష్టమేమీ కాదు

**బరువు తగ్గటమనేది అంత త్వరగా సాధ్యమయ్యేది కాదు. దీనికి సమయం పడుతుంది. ఓపికతో ఆహార, వ్యాయామ నియమాలను పాటించటం అత్యవసరం. అధిక బరువు తో మధుమేహం, అధిక రక్తపోటు వంటి దీర్ఘకాల సమస్యల ముప్పు పెరుగుతుంది. కొన్నిరకాల క్యాన్సర్లూ తలెత్తొచ్చు. వయసు మీద పడుతున్నప్పుడు చురుకుదనమూ తగ్గుతుంది. అందుకే బరువును అదుపులో ఉంచుకోవాలని డాక్టర్లు చెబుతుంటారు. అలాగని మరీ త్వరగా బరువు తగ్గటమూ మంచిది కాదు. దీనికీ ఒక పద్ధతి ఉంది.**



బరువు పెరగటానికి ప్రధాన కారణం– శరీరానికి అవసరమైన వాటి కన్నా ఎక్కువ కేలరీలను తీసుకోవటం. ఖర్చు కాకుండా మిగిలిపోయిన కేలరీలు కొవ్వుగా మారిపోయి, స్థిరపడే ప్రమాదముంది. సమతులాహారం తినకపోవటం, నిద్రలేమి, తగినంత శ్రమ చేయకపోవటం వంటి రకరకాల అంశా ం దీనికి కారణమవుతుంటాయి. బరువు పెరగటంలో జన్యువులు కూడా పాలు పంచుకుంటాయి. కొన్నిరకాల మందులూ దీనికి దోహదం చేయొచ్చు. కాబట్టి వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకోవటం ఎంతైనా అవసరం. ఆరోగ్యకరమైన జీవనశైలితో బరువును అదుపులో పెట్టుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. చిన్న చిన్న మార్పులైనా పెద్ద ప్రభావమే చూపుతాయి. శరీర ఎత్తు, బరువుల నిష్పత్తి (దీవీ×) ఆధారంగా బరువును లెక్కిస్తారు. ఇది 25లోపు ఉండటం మంచిది. 25 నుంచి 29.6 మధ్యలో ఉంటే అధిక బరువుగా.. 30, అంతకన్నా ఎక్కువుంటే ఊబకాయంగా పరిగణిస్తారు. బరువును లెక్కించటానికి బీఎంఐ తేలికైన, సత్వర మార్గమే అయినప్పటికీ.. ఇందులో కొవ్వు మోతాదు కచ్చితంగా తెలియదు. ఒంట్లో నీరు, కండరాలు, ఎముకల బరువులన్నీ బీఎంఐలో కలిసే ఉంటాయి. నిజానికి ఎక్కువ ప్రమాదం అధిక కొవ్వుతోనే! దీని మూలంగా బీఎంఐ పెరిగినట్టయితే నెమ్మదిగా.. వారానికి 450 నుంచి 900 గ్రాముల వరకు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. కొందరు త్వరగా బరువు తగ్గటం మంచిదని భావిస్తుంటారు. కానీ ఎంత త్వరగా తగ్గితే అంతే వేగంగా పెరిగే ప్రమాదముంటుంది. నెమ్మదిగా, క్రమంగా తగ్గే బరువు స్థిరంగా కొనసాగుతూ వస్తుందని తెలుసుకోవాలి.

### తిండి మీద ధ్యాస

బరువు తగ్గటానికి ఆహారం ద్వారా లభించే కేలరీలను తగ్గించుకోవటంతో పాటు కేలరీలు ఎక్కువ ఖర్చయ్యేలా శారీరక శ్రమ చేయటం తప్పనిసరి. రోజులో శరీరం ఖర్చు చేసే కేలరీల కన్నా సుమారు 500 తక్కువ కేలరీలు తీసుకుంటే బరువు తగ్గుతుందన్నది నిపుణుల సూచన. దీంతో వారానికి సుమారు 900 గ్రాముల బరువు తగ్గే అవకాశముంది. కాబట్టి కేలరీలు ఎక్కువగా ఉండే పదార్థాలు, సంతృప్త కొవ్వు పదార్థాలు, వనస్పతి వంటి ట్రాన్స్‌ఫ్యాట్స్ తగ్గించుకోవాలి. అయితే అందరికీ ఒకే రకమైన ఆహార పద్ధతి ఉపయోగపడుతుందని చెప్పలేం. క్రమం తప్పకుండా కొనసాగించగలిగే ఆహార పద్ధతే అన్నింటికన్నా మంచిది. రకరకాల కూరగాయలు, పండ్లు, పొట్టుతీయని ధాన్యాలు, వెన్న తీసిన పాలు, పాల పదార్థాలు.. మాంసాహారులైతే చికెన్, చేపల వంటివన్నీ సమపాళ్లలో తీసుకోవటం ముఖ్యం. మన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ఆయా పదార్థాలను ఎంచుకుంటే మధ్యలో కట్టు తప్పకుండా చూసుకోవచ్చు. కేలరీలను లెక్కించుకొని తినటం ఎలా సాధ్యమని చాలామంది ప్రశ్నిస్తుంటారు. మితంగా తినేలా చూసుకుంటే చాలావరకు కేలరీలను తగ్గించుకోవచ్చు. చిన్న పళ్లాన్ని ఎంచుకుంటే వడ్డించుకునే పదార్థాల పరిమాణమూ తగ్గుతుంది. అలాగే ఆహారాన్ని పూర్తిగా నములుతూ, ఆస్వాదిస్తూ తినటం మంచిది. గబగబా మింగేస్తే కడుపు నిండిన విషయం మెదడుకు తెలియదు. దీంతో మరింత ఎక్కువ తినే ప్రమాదముంది.

### శ్రమ సాయం

ఆహారంతో లభించిన కేలరీలు ఖర్చు కావటానికి శారీరక శ్రమ తోడ్పడుతుంది. వారానికి కనీసం 150 నిమిషాల సేపు ఒక మాదిరి నుంచి తీవ్రమైన వ్యాయామం(వఞవతీఏఱంవ) చేయాలనేది నిపుణుల సూచన. గుండె, శ్వాస వేగాలను పెంచే వ్యాయామాలైతే మరీ మంచివి. వేగంగా నడవటం, ఈత కొట్టటం, డ్యాన్స్ చేయటం వంటివన్నీ ఇలాంటివే. ఎంత మంచివైనా వ్యాయామాలను ఒకేసారి వేగంగా చేయకూడదు. క్రమంగా వేగం పెంచుకుంటూ రావాలి. దీంతో గాయాల పాలవ్వకుండా చూసుకోవచ్చు. బద్ధకంగా కూర్చోవటానికి బదులు తేలికైన వ్యాయామాలైనా చేయాలి. వీటితోనూ కేలరీలు ఖర్చవుతాయి. లిఫ్టుకు బదులు మెట్లు ఎక్కటం, అప్పుడప్పుడూ లేచి కాసేపు నడవటం వంటి చిన్న మార్పులైనా మంచి ఫలితం చూపిస్తాయి. బరువులు ఎత్తటం వంటి కండరాలను దృఢం చేసే వ్యాయామాలనూ మరవరాదు. పెద్దవాళ్లు వారానికి కనీసం రెండు రోజులైనా ఇలాంటివి సాధన చెయ్యాలి.

# జ్ఞాన దీపం.. సన్మార్గ దర్శనం

**జీవులు ధర్మబద్ధంగా జీవించడానికి అవరోధం ఏర్పడినప్పుడు.. భగవంతుడు అవతార పురుషుడిగా ఉద్భవిస్తాడు. దుష్టులను శిక్షస్తాడు. అలాగే నిత్య జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలను అధిగమించడానికి, స్థిరచిత్తంతో ముందుకు సాగడానికి తోడ్పడేందుకు ఆ కరుణాంతరంగుడు సద్గురువుగా అవతరిస్తాడు. ధార్మికతను ప్రబోధిస్తాడు, మోక్షఛ్ఛ కలిగిస్తాడు. అలా అవతరించిన మహాత్ముడే దత్తాత్రేయుడు.**

మార్గశిర పౌర్ణమి త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయుడి జయంతి. అత్రి మహాముని సతీమణి అయిన అనసూయకు త్రిమూర్తులు ఇచ్చిన మాటను అనుసరించి ఆవిడ గర్భం నుంచి దత్తుడు ఉద్భవించాడు. దత్తుని జన్మదిన విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఎక్కువమంది మార్గశిర పౌర్ణమినాడే పండుగ చేసుకుంటారు. 'స్మృతి కౌస్తుభం', 'మార్కండేయ పురాణం' దత్తుని గురించి అనేక విషయాలను తెలియజేస్తున్నాయి.



నారదముని తన భక్తి ప్రపత్తులతో విష్ణుమూర్తిని ప్రసన్నం చేసుకున్నాడు. మెచ్చిన విష్ణువు వరం కోరుకోమనగా.. సత్వరూపం దర్శింపచేయమని అడిగాడు నారదుడు. అప్పుడు 'బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ఒకటిగా చేయగలిగితే నీ కోరిక తీరుస్తాను' అన్నాడు విష్ణుమూర్తి. వెంటనే నారదుడు భూలోకానికి బయల్దేరాడు. తన ప్రయత్నంలో భాగంగా అత్రి మహాముని ఆశ్రమానికి వెళ్లాడు. ఆ సమయంలో ముని ఆశ్రమంలో లేడు. ఆయన సతీమణి అనసూయ ఆతిథ్యమిచ్చింది. తర్వాత నారదుడు వైకుంఠం, కైలాసం, సత్యలోకాలకు వెళ్లినప్పుడు సందర్భవశాత్తూ అనసూయ పాతివ్రత్యం గురించి చెప్పాడు. అది విన్న త్రిమూర్తులు ఆమె పాతివ్రత్యాన్ని పరీక్షించాలనుకున్నారు.

భార్యల సూచనను అనుసరించి త్రిమూర్తులు బ్రాహ్మణ రూపంలో అత్రి మహాముని ఆశ్రమానికి వచ్చారు. తమకు ఆకలిగా ఉందని, వివస్త్రగా భోజనం వడ్డిస్తే తింటామని చెప్పారు. ఆశ్చర్యపోయిన అనసూయ ఈ విషయం భర్తతో చర్చించింది. మహా జ్ఞాని అయిన అత్రిముని సంగతి గ్రహించాడు. భార్యకు మంత్రోదకం ఇచ్చి వారిపై చల్లమన్నాడు. అనసూయ వారిపై మంత్రజలం చిలకరించగానే.. ఆ విప్రులు ఆరు నెలల పసిబాలలుగా మారిపోయారు. అప్పుడు అనసూయ వారికి స్తన్యమిచ్చి సంతృప్తిపరిచింది. అప్పుడే ఆశ్రమానికి వచ్చిన నారదుడు త్రిమూర్తులు శిశువులుగా మారిపోవడం చూశాడు. ఆ విషయాన్ని వారి సతీమణులకు తెలియజేశాడు. వాళ్లు నారదుని వెంట ఆశ్రమానికి వచ్చారు. బాలురు క్రీడించడం చూశారు. ఆ ముగ్గురూ తమ భర్తలేనని గ్రహించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను తమకు అప్పజెప్పమని అత్రిమునిని ప్రార్థించారు.

### వరం కోరిన మునిపత్ని

అత్రిముని అనుజ్ఞతో ఆయన పత్ని అనసూయ.. బాలుర మీద మంత్రోదకం చల్లగానే వారు తిరిగి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా మారారు. అనసూయ పాతివ్రత్యానికి మెచ్చిన త్రిమూర్తులు ఆమెను వరం కోరుకోమన్నారు. దానికి అత్రి, అనసూయ దంపతులు త్రిమూర్తులే తమకు పుత్రుడిగా జన్మిస్తే సంతోషిస్తామని చెప్పారు. వారి ఆశీర్వాదం ఫలించి.. ఆ దంపతులకు మూడు తలలు, ఆరు చేతులతో పుత్రుడు జన్మించాడు. అతడే దత్తాత్రేయుడు. మధ్య శిరస్సు విష్ణువుది, కుడి శిరస్సు శివునిది, ఎడమ శిరస్సు బ్రహ్మది. దత్తుడి దేహంలో కుడి భాగం గురువు. ఎడమ భాగం భగవంతుడు. దత్తాత్రేయుని ఆరు చేతుల్లో– మంత్రాలకు ఆధారమైన జపమాల, సకల శాస్త్రాలకూ నిలయమైన డమరుకం, జ్ఞాన తేజస్సును ప్రసాదించే చక్రం, కమండలం, త్రిశూలం, శంఖం ఉంటాయి.

ఆర్గాన్ న్యూస్
10
తెలంగాణ
శనివారం
12 సెప్టెంబర్ 2026
www.organnews.in
organ.today@gmail.com
@organnews

# పాడి రంగం బలోపేతానికి చర్యలు

- పాడి రైతులకు గిట్టుబాటు ధర.. గోపాలమిత్రలకు సంక్షేమ సౌకర్యాలు
- మధిర, కొడంగల్‌లో సెర్ప్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ
- పశుసంవర్ధక శాఖలో 1100 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు..
- పెరుగుతున్న పాల ఉత్పత్తి-మంత్రి వాకిటి శ్రీహరి



**హైదారాబాద్, సెప్టెంబర్ 11 :** రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేసి, పాడి రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శుక్రవారం శాసనసభలో సభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, గండ్ర సత్యనారాయణ రావు, వీర్లపల్లి శంకరయ్యలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి క్రమంగా పెరుగుతోందని మంత్రి తెలిపారు. 2024--25లో 59.35 లక్షల టన్నులు, 2025--26లో 61.75 లక్షల టన్నుల పాల ఉత్పత్తి నమోదైందన్నారు. 2026--27లో ఆరు నెలల కాలానికి సుమారు 30 లక్షల టన్నుల పాల ఉత్పత్తి జరుగుతుందని ముందస్తు అంచనా ఉన్నట్లు వెల్లడించారు. పాడి రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. 2026 ఆగస్టు 16 నుంచి గేదె పాలకు ప్రతి కిలో వెన్నకు రూ.914, ఆవు పాలకు ప్రతి కిలో వెన్నతో పాటు మొత్తం ఘనపదార్థాల ప్రాతిపదికన రూ.340 ధరలను నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నాణ్యమైన పాల సేకరణకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పాడి రంగాన్ని గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయ వనరుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. పాడి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా మధిర, కొడంగల్ నియోజకవర్గాల్లో సెర్ఫ్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పాడి పశువుల సంఖ్యను పెంచడంతో పాటు, రైతులకు నిరంతర ఆదాయం వచ్చేలా పాడి ఆధారిత జీవనోపాధిని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. పాడి రంగంలో క్షేత్రస్థాయిలో కీలక సేవలు అందిస్తున్న గోపాలమిత్రల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గోపాలమిత్రలకు మెడిక్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద బీమా, సకాలంలో గౌరవ వేతనం, శిక్షణ, సాంకేతిక సహాయం, పర్యవేక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పశువుల ఆరోగ్యం, పాడి రైతుల ప్రయోజనాలు, గ్రామీణ పాడి వ్యవస్థ బలోపేతంలో గోపాలమిత్రల పాత్ర కీలకమని మంత్రి అన్నారు. పశుసంవర్ధక శాఖలో సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి తెలిపారు. 1100 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి, బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పశువుల ఆరోగ్యం, పాల నాణ్యత, వినియోగదారుల భద్రత, పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కర్ణాటకలోని నందిని డెయిరీతో పోలిస్తే తెలంగాణలో విజయ డెయిరీ ద్వారా పాడి రైతులకు ఎక్కువ ధరలు చెల్లిస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పాడి రైతుల ఆదాయాన్ని పెంచడం, పాల సేకరణ వ్యవస్థను బలోపేతం చేయడం, విజయ డెయిరీని మరింత బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ పాడి రంగానికి కొత్త దిశను చూపిస్తామని మంత్రి పేర్కొన్నారు. "పాడి రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.. పాడి పరిశ్రమ బలోపేతమే గ్రామీణ ఆర్థికాభివృద్ధికి పునాది" అని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.



## అల్పపీడన ప్రభావంతో
# ఏపీలో వర్షాలు
### అప్రమత్తమైన ప్రభుత్వం

**అమరావతి, సెప్టెంబర్ 11 :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఒడిశా–ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో కేంద్రీకృతం కావడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. రానున్న మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని సూచించారు. తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు సురక్షితంగా తీరానికి చేరుకోవాలని హోం మంత్రి సూచించారు. అత్యవసర సహాయం కోసం 112, 1070, 1800 425 0101 నంబర్లను సంప్రదించాలని ప్రభుత్వం తెలిపింది.

# పాలనలో స్పీడ్ పెరగాల్సిందే..

**నెలరోజుల్లో ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లో ఉండాలి**
**జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదు**
**ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్**



**అమరావతి, సెప్టెంబర్ 11 :** ప్రభుత్వ దస్త్రాల పరిష్కారంలో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, పాలనలో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా హెచ్చరించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను వీలైనంత వేగంగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పరిపాలనపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో దస్త్రాలను పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం ముఖ్యమని, ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి అభిప్రాయాలతో రూపొందిస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించాలని, అప్పుడే పనితీరును మెరుగుపరుచుకోగలమని సూచించారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో అన్ని శాఖల దస్త్రాలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని స్పష్టం చేశారు. ఈ గడువు తర్వాత భౌతిక (మాన్యువల్) ఫైళ్ల నిర్వహణను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, మంత్రులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. "జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచుగా గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా సమర్పించాలి" అని అన్నారు. సమస్యలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడాలని ఆకాంక్షించారు. పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, సమర్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బందిపై పనిభారాన్ని హేతుబద్ధీకరించాలని (రేషనలైజ్ చేయాలని) అధికారులను ఆదేశించారు. ఒకే ఉద్యోగిపై ఎక్కువ భారం మోపకుండా, అందరికీ సమంగా బాధ్యతలు అప్పగించేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బందికి విధులను స్పష్టం చేస్తూ ఒక జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయానికి ఒక ఎలక్ట్రిక్ సైకిల్ అందించాలని కూడా సూచించారు.

# పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం

- 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చాం
- వైసీపీ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించు జగన్
- విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని విమర్శలు



**అమరావతి, సెప్టెంబర్ 11 :** ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని లోకేశ్ సవాల్ విసిరినా జగన్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. త్వరలోనే లోకేశ్ నాయకత్వంలో మరో మూడు డీఎస్సీలను విజయవంతంగా నిర్వహించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహణకు ఉన్న ప్రాథమిక వ్యత్యాసం కూడా తెలిని వ్యక్తి జగన్ అని కేశినేని చిన్ని ఎద్దేవా చేశారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా పరీక్షలు ఉండవని, ఆ కేటాయింపులు నేరుగా సర్టిఫికెట్ల ఆధారంగా, మెరిట్ ప్రకారం జరుగుతాయని తెలిసినా వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న రామకృష్ణ అనే వ్యక్తికి డీఎస్సీలో ఉద్యోగం వస్తే, ఆయనకు రానట్లు సాక్షి పత్రికలో అబద్ధాలు రాశారని, ఆ బాధితుడు రామకృష్ణ స్వయంగా ఇక్కడే సజీవ సాక్ష్యంగా ఉన్నారని మీడియా ముందు ప్రదర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని జగన్, తొమ్మిది నెలలుగా కుంభకర్ణుడిలా నిద్రపోయి ఇప్పుడు గ్లోబల్ ప్రచారంతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసులో గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించడం, కోడికత్తి డ్రామాలు ఆడటం జగన్‌కు అలవాటేనని ఎంపీ ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ, గ్రూప్–1 నియామకాలలో జరిగిన భారీ అవకతవకలపై ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని తెలిపారు. ఆ అక్రమాల నివేదిక బయటకు వచ్చి తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే డీఎస్సీపై వైసీపీ నేతలు బురద జల్లుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం తప్పని నిరూపించే దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని జగన్‌కు సవాల్ విసిరారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో జగన్ కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని జోస్యం చెప్పారు.

# ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు నుంచి వైదొలగండి

### నాటో దేశాలతో అమెరికా




**యూఎస్ :** అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి వైదొలగాలని నాటో సభ్య దేశాలను అమెరికా కోరింది. దానివల్ల ఆయా దేశాలకు ఎదురయ్యే ముప్పును పరిశీలించాలని.. మద్దతును నిలిపివేయాలని సూచించింది. ఇకనైనా ఐసీసీ నాటకాన్ని ముగిద్దామంటూ పిలుపునిచ్చింది. దాని సామర్థ్యాలను ఓ క్రమపద్ధతిలో రద్దు చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపింది. జులైలో బ్రస్సెల్స్‌లో జరిగిన నాటోకు చెందిన 32మంది రాయబారుల రహస్య సమావేశంలో అమెరికా ఈ డిమాండ్ లేవనెత్తినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఐసీసీ నుంచి వైదొలగాలని అమెరికా రాయబారి మాథ్యూ జార్జ్ సభ్య దేశాలను కోరినట్లు సమాచారం. ఈ విషయంలో ఎవరు తమతో కలిసివస్తారనే విషయాన్ని అమెరికా నిశితంగా గమనిస్తోందని తెలిపారు. అయితే ఫ్రాన్స్, నెదర్లాండ్స్ ఐసీసీని సమర్థించాయి. అగ్రదేశ వైఖరికి తాము మద్దతివ్వబోమని స్పష్టం చేశాయి. మరోవైపు ఐసీసీ అమెరికా సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకుంటోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సైతం ఆరోపించారు. తమను సవాలు చేయడానికి ఐసీసీ మద్దతుదారులు అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలను వాడుకుంటున్నారని మండిపడ్డారు. తమ అధికారాలు, స్వేచ్ఛను పరిమితం చేయడానికి ప్రయత్నిస్తే అమెరికా తీవ్రంగా ప్రతిస్పందిస్తుందని హెచ్చరించారు. జాతి నిర్మూలన, యుద్ధ నేరాలతో సహా తీవ్రమైన అంతర్జాతీయ నేరాలకు పాల్పడిన వారిపై విచారణ జరిపేందుకు 2002లో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును స్థాపించారు. ఇందులో నాటోకు స్వయంగా సభ్యత్వం లేదు. అయితే, అమెరికా, తుర్కియే మినహా అన్ని నాటో దేశాలు ఈ కోర్టులో సభ్యులుగా ఉన్నాయి.

# బహ్రెయిన్‌పై ఇరాన్ దాడి..

### అమెరికా నేవీ కీలక స్థావరం ధ్వంసం



**టెహ్రాన్ :** ఇరాన్–అమెరికా మధ్య దాడులు మళ్లీ ప్రారంభమవడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అగ్రరాజ్య దాడులకు ప్రతిస్పందనగా గల్ఫ్ దేశాలలోని వివిధ అమెరికా స్థావరాలపై టెహ్రాన్ విరుచుకుపడుతోంది. తాజాగా బహ్రెయిన్‌లోని అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంపై దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో తమ కీలక స్థావరమైన నేవల్ సపోర్ట్ యాక్టివిటీ బహ్రెయిన్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు యూఎస్ నేవీ తాత్కాలిక కార్యదర్శి హంగ్‌కావో పేర్కొన్నారు. పశ్చిమాసియాలో అమెరికా నౌకాదళ కార్యకలాపాలకు ఎన్ఏఎస్‌బీ ప్రధాన లాజిస్టిక్స్ కేంద్రంగా పనిచేస్తోంది. ఫిబ్రవరిలో అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి బహ్రెయిన్‌లోని ఈ కీలక స్థావరాన్ని ఐఆర్‌జీసీ పలుమార్లు లక్ష్యం చేసుకుంది. తాజా దాడుల్లో అందులోని మౌలిక సదుపాయాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఈ స్థావరాన్ని మరమ్మతు చేయాలా వద్దా.. అనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు హంగ్‌కావో పేర్కొన్నారు. ప్రత్యామ్నాయాల పైనా చర్చలు జరుగుతున్నట్లు తెలిపారు. ఎన్ఏఎస్‌బీతో పాటు బహ్రెయిన్‌లోని ఇతర అమెరికా సైనిక స్థావరాలపైనా దాడులు చోటుచేసుకున్నాయి. జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ దాడులు చేయడంతో పలు సైనిక విమానాలు ధ్వంసమయ్యాయి. ఏ–10 థండర్‌బోల్ట్ విమానంతో పాటు ఎనిమిది ఎఫ్–15 యుద్ధ విమానాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఇరాన్ దాడులను అడ్డుకునేందుకు అమెరికా బలగాలు 30 పాట్రియాట్ క్షిపణులను మోహరించాయి. ఇరాన్‌కు చెందిన 5 యుద్ధ నౌకలను మంగళవారం అమెరికా ధ్వంసం చేయడంతో ఇరాన్ ప్రతిదాడులు చేసింది. మరోవైపు టెహ్రాన్‌కు అనుకూలంగా ఉన్న హూతీ దళాలు ఎర్ర సముద్ర తీరంలో తమ కార్యకలాపాలను విస్తరించాయి.



# రైతుల మోటార్లకు మీటర్లు పెట్టబోము


- ఎక్కడా మీటర్లకు పెట్టాలనే నిబంధన లేదు
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదారాబాద్, సెప్టెంబర్ 11 :** రైతుల మోటర్లకు ఎట్టి పరిస్థితుల్లో మీటర్లు పెట్టబోమని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను అప్?గ్రేడ్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్?డీఎస్?ఎస్ పథకాన్ని వినియోగించుకుంటామన్నారు. అందులో ఎక్కడా వ్యవసాయ మోటర్లకు మీటర్లకు పెట్టాలనే నిబంధన లేదని భట్టి విక్రమార్క తెలిపారు. అలాంటి భయాందోళన సృష్టించవద్దని ఆయన సూచించారు. థర్మల్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటూ వెళ్లాల్సిన అవసరముందని భట్టి విక్రమార్క తెలిపారు.రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించడానికి ప్రభుత్వం ఏటా రూ.14,000 కోట్లు, 53 లక్షల గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 5,000 కోట్లు చెల్లిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ విధంగా కేవలం సబ్సిడీల రూపంలోనే ఏటా దాదాపు రూ.19,000 కోట్లు ఖర్చవుతోందని ఆయన వివరించారు. ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ఖజానాపై భారం తగ్గడంతో పాటు రైతులు స్వయంసమృద్ధి సాధిస్తారన్నారు. పగటిపూట లభించే సోలార్ విద్యుత్ రాత్రివేళ అందుబాటులో ఉండనందున, ఎంపిక చేసిన గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌తో మైక్రో గ్రిడ్లను నిర్మిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోలార్ విద్యుత్‌తో పాటు బ్యాటరీ స్టోరేజ్ ద్వారా గ్రామాలకు విద్యుత్ ఇచ్చే 'మైక్రో గ్రిడ్' ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా(పైలట్?) చేపట్టామని ఆయన మండలిలో వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వీజీఎఫ్ ద్వారా మూడుసార్లు టెండర్లు పిలిచినా, బ్యాటరీ స్టోరేజ్ ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో సాంకేతికత పెరిగి బ్యాటరీ ధరలు తగ్గితే ఈ ప్రాజెక్టులు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా పర్యావరణహితమైన హరిత ఇంధన రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ–2025 విశేషాలను వివరించారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కేవలం 15,497 మెగావాట్లుగా మాత్రమే ఉండేదని, అయితే సెప్టెంబర్ 9 నాటికి అది 19,543 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. వివిధ కారణాల రీత్యా ఈ ఏడాది డిమాండ్ 20,000 నుంచి 21,000 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని, ఈ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే సాంప్రదాయ, సాంప్రదాయేతర ఇంధన వనరులను సమన్వయం చేస్తూ ఈ నూతన పాలసీని తెచ్చినట్లు తెలిపారు. పీఎం–కుసు–ుమ్ పథకం కింద రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు భట్టి వెల్లడించారు. ఒక్కొక్కరు 2 మెగావాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్‌గా పూర్తి సోలరైజేషన్ పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. ?కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందని, ఇటీవల కరీంనగర్‌లో ఒక ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. మణుగూరు వద్ద సింగరేణి చేపట్టిన మిథేన్ గ్యాస్ ప్రాజెక్ట్ ఖర్చు ఎక్కువగా ఉండటంతో గిట్టుబాటు కాలేదని, అయితే కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం జరుపుతున్నామని తెలిపారు.

# ఐఫోన్ల విక్రయాలు తగ్గొచ్చు..



యాపిల్ తన కొత్త మోడల్ 'ఐఫోన్ 18'ను విడుదల చేసిన వెంటనే భారత్‌లో పాత ఐఫోన్ల ధరలు భారీగా పెంచేసింది. మరోవైపు, కొత్తగా విడుదల చేసిన ఫోల్డబుల్ ఫోన్‌తో పాటు ఐఫోన్ 18 శ్రేణి ధరలు కూడా విపరీతంగా ఉన్నాయి. దీనిపై ఇప్పటికే నెట్టింట సెటైర్లు పేలుతున్నాయి. అయితే, ఈ ధరల ప్రభావం దేశీయంగా ఐఫోన్ విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపొచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. 2026 క్యాలెండర్ సంవత్సరంలో భారత్‌లో ఐఫోన్ విక్రయాలు కాస్త తగ్గే అవకాశం ఉందని మార్కెట్ రీసెర్చర్స్ ఐడీసీ ఇండియా, కౌంటర్‌పాయింట్ అంచనా వేశాయి. దేశీయంగా ఈ విక్రయాల్లో తొలిసారి క్షీణత నమోదవ్వొచ్చని పేర్కొన్నాయి. అయితే, అమ్మకాల విలువ పరంగా చూస్తే మాత్రం.. 6-7శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా వేశాయి. మరోవైపు, ఐఫోన్ల ధరల పెంపు వల్ల గ్రే మార్కెట్ విక్రయాలు, వ్యక్తిగత దిగుమతులు పెరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల రిటైల్ మార్కెట్ దెబ్బతిని, వ్యాపారులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొంది.



# బిజినెస్



## ఎన్ఎస్ఈ ఐపీఓ తేదీలొచ్చాయ్..

మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ పబ్లిక్ ఇష్యూ తేదీలు వచ్చేశాయి. సెప్టెంబరు 17న ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఎన్ఎస్ఈ షేరు ధరల శ్రేణిని రూ.1700–రూ.1785గా నిర్ణయించారు. ఒక్కో షేరు ముఖ విలువను రూ.1గా పేర్కొన్నారు. ఒక లాట్ పరిమాణంలో ఎనిమిది షేర్లు ఉంటాయి. అంటే.. రిటైల్ ఇన్వెస్టర్లు ఒక లాట్ కోసం రూ.14,280 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

సబ్‌స్క్రిప్షన్ ప్రారంభ తేదీ : సెప్టెంబరు 17
ముగింపు తేదీ: సెప్టెంబరు 21
షేర్ల కేటాయింపు: సెప్టెంబరు 22
డీమ్యాట్ ఖాతాల్లో షేర్ల క్రెడిట్: సెప్టెంబరు 23
లిస్టింగ్ తేదీ: సెప్టెంబరు 24

షేరు ధర అప్పర్ బ్యాండ్ వద్ద ఎన్ఎస్ఈ ఐపీఓ విలువ రూ.22,561.57కోట్లుగా ఉండనుంది. దీంతో దేశంలో రెండో అతిపెద్ద ఐపీఓగా రికార్డు సృష్టించనుంది. మొత్తం షేర్లలో 35శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించారు. 50శాతం క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బిడ్డర్లకు రిజర్వ్ చేశారు. మిగతా షేర్లను నాన్–ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉంచనున్నారు. అర్హత కలిగిన ఎన్ఎస్ఈ ఉద్యోగులకు షేరకు రూ.170 చొప్పున డిస్కౌంట్ లభించనుంది. మొత్తం 12.64 కోట్ల ఈక్విటీ షేర్లను పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే విక్రయించనున్నారు. వీటిని ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ వంటి సంస్థల ద్వారా సేల్‌కు పెట్టనున్నారు. ఇందులో ఒక్క ఎస్‌బీఐనే 2.48 కోట్ల షేర్లను విక్రయించనుంది. గతంలో మొత్తం 14.89 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించాలని ప్రణాళికలు చేసినప్పటికీ.. ఇష్యూ పరిమాణాన్ని 15శాతం మేర కుదించారు. వాస్తవానికి ఈ ఐపీఓ దశాబ్దం క్రితమే రావాల్సి ఉంది. కో–లొకేషన్ వివాదం కారణంగా ఇన్నాళ్లూ ఆలస్యమైన ఈ పబ్లిక్ ఇష్యూకు ఇటీవలే సెబీ నుంచి ఆమోదం లభించింది.





## బ్యాటింగ్ లైనప్ టీమిండియాకు తలనొప్పే

### సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్

అఫ్ఘానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో బ్యాటింగ్ లైనప్‌ను ఎంచుకోవడం టీమిండియాకు తలనొప్పేనని సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా తిలక్ వర్మను ఏ స్థానంలో ఆడిస్తారని, అతని ఎంపిక సవాల్‌గా మారుతుందని తెలిపాడు. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్‌లతో కూడిన భారత బ్యాటింగ్ లైనప్‌లో తిలక్ వర్మ బ్యాటింగ్ స్థానంపై సందేహాలు నెలకొన్నాయని డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు.. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఘోర పరాజయాలను చవిచూసింది. ఆరు మ్యాచ్‌ల్లో చిత్తయ్యింది. ఆ తర్వాత జింబాబ్వే పర్యటనలో 3–0తో సిరీస్‌ను గెలుచుకుంది. సెప్టెంబర్ 13 నుంచి సొంతగడ్డపై అఫ్ఘానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ అనంతరం జపాన్‌తో చారిత్రాత్మక టీ20తో పాటు అక్కడే జరిగే ఆసియా గేమ్స్ 2026లో పాల్గొననుంది. టీమిండియా కాంబినేషన్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన డివిలియర్స్.. తిలక్ వర్మ బ్యాటింగ్ స్థానంపై సందేహం వ్యక్తం చేశాడు. 'బ్యాటర్లను ఎంపిక చేయడంలో కచ్చితంగా కొన్ని సమస్యలు ఉంటాయి. జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ ఉన్నారు. ఇక్కడే టీమ్ కాంబినేషన్ ఎంచుకోవడం కొంచెం కష్టం అవుతుంది. తిలక్ వర్మ ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు? ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత తిలక్ వర్మ 10 ఇన్నింగ్స్‌ల్లో 159.36 స్ట్రైక్‌రేట్‌తో 255 పరుగులు చేశాడు. అయితే అతను కేవలం మూడు సార్లు మాత్రమే 50 పరుగుల మార్కును దాటాడు. ఇది అతని బ్యాటింగ్‌లోని నిలకడలేనితనాన్ని సూచిస్తుంది. ఇది చాలా బలమైన జట్టు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ సరైన సమతుల్యతను సాధించడం కష్టం. ఇది టీ20 మ్యాచ్ కాబట్టి, వారు జట్టులోని చిన్న మార్పులు చేసి ఆడవచ్చు. ఆటగాళ్ల పాత్రలు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. అఫ్ఘానిస్థాన్ వంటి ప్రమాదకరమైన జట్టును ఎదుర్కోబోతున్నందుకు ప్రతీ ఆటగాడి బాధ్య తను గుర్తు చేయడం చాలా కీలకం.'అని డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు.



## పాకిస్థాన్‌పై ఘన విజయం..

### ఆసియా కప్ ఫైనల్‌కు దూసుకెళ్లిన శ్రీలంక

**దుబాయ్:** మహిళల ఆసియా కప్ ఫైనల్‌కు శ్రీలంక దూసుకెళ్లింది. పాకిస్థాన్‌తో జరిగిన సెమీఫైనల్‌లో 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 131 పరుగుల లక్ష్యాన్ని 18.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇమేశా దులానీ 24, హర్షిత సమర విక్రమ 36, కవీశా దిల్హారి 33, నీలాక్షిక 18లి, కౌశాని 10లి రన్స్ చేశారు. పాక్ బౌలర్లలో ఫాతిమా సనా 4 వికెట్లు పడగొట్టింది. సాదియా ఇక్బాల్, ఉమ్ ఇ హని చెరో వికెట్ తీశారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 130/5 పరుగులు చేసింది. ఫాతిమా సనా 47లి, షవాల్ జుల్ఫికర్ 24, గుల్ ఫెరోజా 21 రన్స్ చేశారు. శ్రీలంక బౌలర్లలో చమరి ఆటపట్టు, చముడి ప్రబోధ చెరో 2 వికెట్లు తీశారు. సుగంధిక కుమారి ఒక వికెట్ పడగొట్టింది. సెప్టెంబర్ 13న జరిగే ఫైనల్ మ్యాచ్‌లో భారత్‌తో శ్రీలంక తలపడనుంది.

## రంజీ ట్రోఫీ షెడ్యూల్ మార్పులపై గవాస్కర్ ఆగ్రహం

**భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) రూపొందించిన దేశవాళీ షెడ్యూల్‌పై టీమ్ ఇండియా దిగ్గజ మాజీ సారథి సునీల్ గవాస్కర్ తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన రెడ్ బాల్ టోర్నీ రంజీ ట్రోఫీని బోర్డు చిన్నచూపు చూస్తోందని విమర్శించాడు. ప్రస్తుత క్యాలెండర్ ప్రకారం రంజీ ట్రోఫీని రెండు దశలుగా విభజించి, వాటి మధ్యలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలను నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ షెడ్యూలింగ్ గందరగోళంపై స్పోర్ట్‌స్టార్ కాలమ్‌లో గవాస్కర్ స్పందిస్తూ, "ఒక వైట్ బాల్ టోర్నమెంట్ కోసం రెడ్ బాల్ టోర్నమెంట్‌ను మధ్యలోనే ఎలా ఆపేస్తారు? ఇది ఆటగాళ్ల రిథమ్, మొమెంటమ్‌ను పూర్తిగా నాశనం చేస్తుంది" అని ఆవేదన చెందాడు.**



సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీని సెప్టెంబర్‌లోనే నిర్వహించవచ్చని, కానీ ఐపీఎల్ వేలానికి సమీపంలో ఉండాలనే ఉద్దేశంతోనే బీసీసీఐ ఇలా చేస్తోందని గవాస్కర్ విమర్శించాడు. "రంజీ ట్రోఫీ తరహాలోనే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని కూడా క్వార్టర్ ఫైనల్ వరకు ఆడి, కొద్ది వారాల విరామం తర్వాత సెమీస్, ఫైనల్స్ నిర్వహించవచ్చు కదా? అలా చేయరు. ఎందుకంటే ఈ టోర్నీ ముగిసిన వెంటనే ఐపీఎల్ వేలం జరుగుతుంది. ఒకవేళ వేలం రెండు నెలల తర్వాత జరిగినా ఫ్రాంచైజీలు ప్రతిభావంతులైన ఆటగాళ్లను మరిచిపోరు" అని అతడు తెలిపాడు. ఆట అసలు సిసలైన పునాది అయిన ఫస్ట్ క్లాస్ క్రికెట్‌ను పక్కనపెట్టి లీగ్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం సరైంది కాదని తెలిపాడు. ప్రస్తుత బీసీసీఐ వ్యవస్థలో అనుభవం లేని వ్యక్తుల జోక్యం పెరగడం వల్లే ఇలాంటి తప్పుడు నిర్ణయాలు వస్తున్నాయని గవాస్కర్ విమర్శించాడు. గతంలో బోర్డులో టెక్నికల్ కమిటీ, ఫిక్చర్స్ కమిటీ ఉండేవని గుర్తుచేశాడు. "గతంలో మాజీ ఆటగాళ్లు, సీనియర్ అంపైర్లు, అనుభవజ్ఞులైన నిర్వాహకులు ఆ కమిటీల్లో సభ్యులుగా ఉండి మ్యాచ్‌ల నిర్వహణ సజావుగా సాగేలా చూసేవారు. అలాంటి అనుభవజ్ఞుల సేవలను మళ్లీ వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత భారత క్రికెట్ వ్యవస్థ కాస్త దారితప్పింది, సరైన నిపుణుల సలహాలతో దాన్ని సరిచేయాలి" అని సూచించాడు. టెస్ట్ క్రికెట్‌కు ఆటగాళ్లను అందించే రంజీ ట్రోఫీ ప్రాధాన్యత ఏమాత్రం తగ్గకుండా చూడాలని, షెడ్యూలింగ్ లో నిలకడ లేకపోతే యువ క్రికెటర్ల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందని గావస్కర్ అభిప్రాయపడ్డాడు.

## మళ్లీ పూర్తి రిథమ్ సాధించా..

### భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్

శ్రీలంక టూర్ సందర్భంగా తన బౌలింగ్ వేగం, రిథమ్ పడిపోవడంపై భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ పెదవి విప్పాడు. రెండు నెలల పాటు ఆటకు పూర్తిగా దూరంగా ఉండటం వల్లే క్రీజులో ఇబ్బంది పడ్డానని, అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్లో సుదీర్ఘ స్పెల్స్ వేయడం ద్వారా తిరిగి పాత లయను అందుకున్నానని తెలిపాడు. శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ సాధారణంగా వేసే 140 కిలోమీటర్ల వేగానికి బదులు కేవలం 120ల వేగంతోనే బంతులు విసిరాడు. నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి 44 ఓవర్లు వేసినప్పటికీ బ్యాటర్లను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయాడు. దీనిపై దులీప్ ట్రోఫీ ఫైనల్ అనంతరం సిరాజ్ మాట్లాడుతూ, "రెండు నెలల సుదీర్ఘ బ్రేక్ తర్వాత నేరుగా మ్యాచ్‌లోకి అడుగుపెట్టడంతో నా రిథమ్ దెబ్బతింది. నేను పూర్తిగా రిథమ్‌పై ఆధారపడే బౌలర్‌ని. శరీర కదలికలు సమన్వయంలో లేకపోతే క్రీజులో వేగం చూపించలేను. నా రన్‌అప్‌లో కొన్ని అడుగులు చిన్నవిగా, మరికొన్ని పెద్దవిగా పడటంతో ఫ్లో మిస్సయి పేస్ తగ్గింది" అని వివరించాడు. జూన్ 8న అఫ్గానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్ ముగిసిన తర్వాత రెండు నెలల విశ్రాంతి తీసుకుని ఆగస్టు 7న శ్రీలంక పర్యటనకు సిరాజ్ వెళ్లాడు. అయితే చేపాక్‌లో ఈస్ట్ జోన్‌తో జరిగిన ఫైనల్లో సౌత్ జోన్ తరఫున 41 ఓవర్ల పాటు బౌలింగ్ చేయడం ద్వారా రాబోయే కఠినమైన సీజన్‌కు తన శరీరం పూర్తిగా సిద్ధమైందని సిరాజ్ భావిస్తున్నాడు. "ఇక్కడ అంతా దారికొచ్చింది, దాంతో సహజంగానే పేస్ పెరిగింది. కొలంబో టెస్ట్ తర్వాత కేవలం వారం రోజుల్లోనే చెన్నైకి వచ్చి భానుడి ప్రతాపంలో బౌలింగ్ చేయడం చాలా కష్టమనిపించింది. కానీ దేశానికి ఆడుతున్నప్పుడు ఎలాంటి సాకులు చెప్పకూడదు. మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్లు రాకపోయినా, పడిన కష్టం అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో తప్పక ఫలితాన్ని ఇస్తుంది. నా పదేళ్ల కెరీర్‌లో ఎప్పుడూ రెండు నెలల బ్రేక్ తీసుకోలేదు. నా శరీరం ఎక్కువ ఓవర్లు వేస్తేనే మెరుగ్గా స్పందిస్తుంది" అని అన్నాడు. ఈ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రత్యర్థి ఈస్ట్ జోన్ తరఫున ఆడిన తన పాత భాగస్వామి మహమ్మద్ షమీతో సిరాజ్ కాసేపు మాట్లాడాడు. ఈ సంభాషణ గురించి షమీ స్పందిస్తూ, "మొదటి ఇన్నింగ్స్‌లో సిరాజ్ తన సహజమైన రిథమ్ కోసం




ఇబ్బంది పడ్డాడు. మళ్లీ ఫామ్‌లోకి రావాలంటే నీ సహజమైన బలాలపై మాత్రమే దృష్టి పెట్టాలని అతడికి గుర్తుచేశాను. రన్‌అప్, రిథమ్ సరిగ్గా కుదిరితే లైన్ అండ్ లెంగ్త్ ఆటోమేటిక్‌గా సెట్ అవుతాయి" అని తెలిపాడు. సీనియర్ బౌలర్ ఇచ్చిన సలహాలు సిరాజ్ రెండో ఇన్నింగ్స్‌లో మెరుగ్గా బౌలింగ్ చేయడానికి తోడ్పడ్డాయి. పూర్తి ఫిట్‌నెస్‌తో పాటు రన్‌అప్ గాడిన పడటంతో రాబోయే న్యూజిలాండ్ సిరీస్‌లో సిరాజ్ మునుపటి వాడివేడి బంతులతో చెలరేగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజెంట్ సిరాజ్.. ఎక్కువగా అంతర్జాతీయ టెస్టులు మాత్రమే ఆడుతున్నాడు.



## నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో కోలుకున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంక్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో భారీగా రికవరీ అయ్యాయి. సెన్సెక్స్ దాదాపు 620 పాయింట్లు మేర కోలుకుంది. మళ్లీ ఆఖర్లో స్వల్ప నష్టాల్లోకి జారుకున్నాయి. ఆసియా మార్కెట్‌లు దాదాపు నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 74,309.16 (క్రితం ముగింపు 74,902.59) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,160.16 వద్ద కనిష్ఠాన్ని తాకింది. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో మధ్యాహ్నం తర్వాత సూచీ నష్టాలను భర్తీ చేసింది. చివరికి 120.83 పాయింట్ల నష్టంతో 74,781.76 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 79.70 పాయింట్ల నష్టంతో 23,398 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.57గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, రిలయన్స్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4347 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## ఇ-కామర్స్ రూల్స్

### డిస్కౌంట్‌కు ముందు ధరెంతో చెప్పాల్సిందే!

ఆఫర్ల సీజన్‌కు ముందు ధరలు పెంచేసి.. తీరా కొనుగోలు సమయంలో భారీ డిస్కౌంట్ అంటూ పలు ఇ–కామర్స్ సంస్థలు చేసే మోసాలకు చెక్ పడనుంది. ఆన్‌లైన్ షాపింగ్‌లో జరిగే మోసాలను అరికట్టడంలో భాగంగా కన్స్యూమర్ ప్రొటెక్షన్ రూల్స్, 2020ని కేంద్రం సవరించింది. ఉత్పత్తుల ధరల్లో పారదర్శకతను పెంచేందుకు, సెర్చ్ రిజల్ట్స్‌లో వినియోగదారులను తప్పుదోవ పట్టించకుండా నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సవరించిన నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. సవరించిన నిబంధనల ప్రకారం.. ఏదైనా వస్తువుపై డిస్కౌంట్ ప్రకటించినప్పుడు, తగ్గింపు ధరతో పాటు అంతకుముందు ఉన్న అసలు ధరను కూడా స్పష్టంగా చూపించాలి. ఆఫర్ ప్రకటించడానికి ముందు ఉన్న 30 రోజుల్లో ఆ వస్తువు అత్యల్ప ధరనే అసలు ధరగా పరిగణించాలి. దీనివల్ల సేల్స్ కంటే ముందే ధరలను పెంచి, ఆ తర్వాత భారీ డిస్కౌంట్ ఇస్తున్నట్లు చూపించే మోసాలకు చెక్ పడనుంది. ఇ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు తమ సెర్చ్ రిజల్ట్స్‌లో యూజర్లను తప్పుదోవ పట్టించకూడదు. వినియోగదారులు ఉత్పత్తులను వెతికే సమయంలో, తమకు లాభదాయకంగా ఉన్న లేదా తక్కువ ఆఫర్లు ఉన్న ఉత్పత్తులను కావాలని చూపించకూడదు. ప్రకటనల ద్వారా ప్రమోట్ చేసిన ఉత్పత్తులను వినియోగదారులు సులభంగా గుర్తించేలా స్పష్టత ఇవ్వాలి. సాధారణ ఉత్పత్తులకు, ప్రకటనల ద్వారా వచ్చే ఉత్పత్తులకు మధ్య తేడా స్పష్టంగా ఉండేలా చూడాలి. వస్తువుకు సంబంధించి ఎక్స్‌పైరీ డేట్, తయారైన దేశం, రీఫండ్ ు రిటర్న్ పాలసీలు, వారంటీ, డెలివరీ సమయం, పేమెంట్ వివరాలను తప్పనిసరిగా తెలపాలి. వినియోగదారుల అనుమతి లేకుండా వారి వ్యక్తిగత వివరాలను ఇ–కామర్స్ సంస్థలు ఇతర అవసరాల కోసం ఉపయోగించకూడదు. ఏదైనా ఇతర ప్రయోజనాల కోసం డేటాను వాడాలంటే కస్టమర్ ధ్రువీకరణ తప్పనిసరి. మెంబర్‌షిప్ ప్రోగ్రామ్‌లు, చట్టబద్ధమైన సర్వీసులు మినహా కొనుగోలుకు సంబంధం లేని ఇతర సేవల పేరిట అదనపు ఛార్జీలను వసూలు చేయకూడదు. ప్రతి ఇ–కామర్స్ సంస్థ జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌తో తప్పనిసరిగా అనుసంధానమై ఉండాలి. వినియోగదారులు నమోదు చేసే ఫిర్యాదు కాపీని వెంటనే వారికి అందజేయాలి.



# జూనియర్ ఎన్టీఆర్ డాన్స్ అంటే ఇష్టం

ఒకప్పుడు తన అందంతో కుర్రాళ్లను కవ్వించిన భామల్లో రంభ ఒకరు. ఆమె అందం నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అప్పట్లో స్టార్ హీరోల సరసన నటించింది మిప్పించింది. తన అందంతో ఇండస్ట్రీని ఊపేసింది. సినిమాలో హీరోయిన్ గా చేస్తూనే మరో వైపు స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది రంభ. అందం అభినయంతో ఉర్రుతలూగించిన రంభ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. రంభ గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ప్రేక్షకులతో పంచుకున్నారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ గురించి కొన్ని ఆసక్తికర కామెంట్స్ చేశారు రంభ. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొన్నటి వరకు టాలీవుడ్ స్టార్ హీరోగా రాణించిన తారక్, ట్రిపుల్ ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. ఇప్పుడు తారక్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఆయన డాన్స్‌లకు సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. టాలీవుడ్‌లో బెస్ట్ డాన్సర్ ఎవరంటే ఎన్టీఆర్ పేరే చెబుతారు. ఎన్టీఆర్ డాన్స్ గురించి ఇప్పటికే చాలామంది సెలబ్రిటీలు ప్రశంసించారు. అలాగే నటి రంభ కూడా తారక్ డాన్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపింది. తాను చేసిన ఐటెం సాంగ్స్ లో నాచోరే నాచోరే సాంగ్ అంటే ఇష్టమని రంభ చెప్పింది. ఎన్టీఆర్ డాన్స్ చేస్తే కన్నార్పకుండా చూస్తామని, ఆయన డెడికేషన్ చూస్తే పిచ్చెక్కుతుందని ఆమె పేర్కొంది. తన దృష్టిలో మైకేల్ జాక్సన్ కన్నా తారక్ బెస్ట్ డాన్సర్ అని రంభ ప్రశంసలతో ముంచెత్తింది. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రంభ మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లతో సినిమా చేయాలనే తన కోరికను కూడా బయటపెట్టింది.



# ‘మహేంద్రగిరి వారాహి’ సస్పెన్స్ థ్రిల్లర్

టాలీవుడ్ నటుడు సుమంత్ ఇటీవల అనగనగా, న్యూటన్ థర్డ్ లా వంటి సినిమాలతో మంచి సక్సెస్ అందుకున్నారు. అదే జోష్?లో ఆయన తాజాగా మహేంద్రగిరి వారాహి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. దేవుడు, దెయ్యాలపై ఏ మాత్రం నమ్మకంలేని సిద్ధార్థ్ (సుమంత్) తన యూట్యూబ్ ఛానెల్?తో ప్రజకలను చైతన్యవంతులను చేస్తుంటాడు. అందులో మూఢ నమ్మకాల ప్రచారంతో జనాలను దోచుకునే బురిడీ బాబాల బండారాలకు సంబంధించిన వీడియోలు తన యూట్యూబ్ ఛానెల్?లో పోస్టు చేస్తుంటాడు. అయితే తన సోదరుడు రాజీవ్ (కమల్ కామరాజు)కి పెళ్లి ఖాయం అవుతుంది. కానీ, అతడి జాతకంలో అపమృత్యు దోషం ఉందని, వారాహి అమ్మవారికి పూజలు చేస్తే అది తొలగిపోతుందని చెప్తారు. ఇందుకోసం అతడు విజయనగరంలోని మహేంద్రగిరి ఆలయానికి వెళ్తారు. పూజలు పూర్తయ్యాక రాజీవ్‌తో పాటు ఆ మహేంద్రగిరి రాజ వంశీకుడు నాగేంద్రవర్మ (వంశీ చాగంటి) కన్నుమూస్తారు. దీంతో గత 150ఏళ్లుగా ఆ కుటుంబంలో పుట్టిన మగబిడ్డ ఎవరైనా 33వ పుట్టినరోజునే మరణిస్తారన్న ఆసక్తికర విషయం సిద్ధార్థ్‌కి తెలుస్తుంది. ఆ కుటుంబానికి వారాహి అమ్మవారి శాపంతోనే అలా జరుగుతుందని ఊళ్లో నమ్ముతారు. దీంతో ఆ మరణాల వెనుకు ఉన్న రహస్యాన్ని ఛేదించేందుకు సిద్ధార్థ్ రంగంలోకి దిగుతాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అది అమ్మవారు శపమేనా? అసలు సిద్ధు అన్న చావుకి, మహేంద్రగిరి వంశానికి ఉన్న సంబంధం ఏంటి? అనేది బిగ్?స్క్రీన్?పై చూసి తెలుసుకోవాల్సిందే! మహేంద్రగిరి సంస్థానంలోని ఒక రాజవంశం చేసిన పొరపాటు వల్ల, వారాహి అమ్మవారి ఆగ్రహానికి గురై ఆ కుటుంబంలోని మగవాళ్లంతా 33వ పుట్టినరోజు నాడే చనిపోతుంటారు. దీంతో ఇది ‘మురారి’ సినిమాను గుర్తు చేస్తుంటుంది. కానీ ఇందులో ప్రతీకార నేపథ్యం కథకు కొత్త లుక్ తెచ్చింది. సిద్ధు జొన్నలగడ్డ పాత్ర చుట్టూ నడిచే డ్రామా, హీరో ఫ్యామిలీ మహేంద్రగిరిలో అడుగుపెట్టాక వచ్చే ట్విస్ట్‌లుతో డైరెక్టర్ సంతోష్ ఈ మూవీని చాలా గ్రిప్పింగ్‌గా, వేగంగా ముందుకు నడిపించారు. ఇక ప్రీ ఇంటర్వెల్ సీన్స్?తో కథ ఆసక్తికరంగా మారుతుంది.

# నేడు ‘ఆదర్శ కుటుంబం’ టీజర్ విడుదల

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న ‘ఆదర్శ కుటుంబం’ (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను రేపు (శనివారం) మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన ‘కేజీఎఫ్’ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ ‘నువ్వు నాకు నచ్చావ్’, ‘మల్లీశ్వరి’ చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది. ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



## ‘ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్’

# సబ్జెక్ట్‌తోనే కాస్త సమస్య!

‘బేబీ’తో హిట్ జోడీ అనిపించుకున్నారు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య. ‘90ం’ వెబ్ సిరీస్‌తో ట్రెండ్ సృష్టించారు దర్శకుడు ఆదిత్య హాసన్.

90స్’ కుటుంబంలో అందరికంటే చిన్నవాడైన ఆదిత్య కథ ఇది. సినిమా దర్శకుడు కావాలని, చిత్ర పరిశ్రమలో స్థిర పడాలనేది తన కల. ఆ ప్రయత్నాల్లో ఉండగానే మధ్య తరగతి కుటుంబాల ప్లాన్ – బి ఆలోచనల్లో భాగంగా పై చదువుల కోసమని లండన్ బయల్దేరతాడు. అక్కడకు వెళ్లి నా మనసు నిండా సినిమా ఆలోచనలే. తాను చేరిన విశ్వ విద్యాలయంలోనే తెలుగమ్మాయైన కదలి (వైష్ణవి చైతన్య) పరిచయం అవుతుంది. తొలి రోజే ఒకరికొకరు దగ్గరవుతారు. ఆ తర్వాత సహజీవనం చేస్తారు. వేర్వేరు నేపథ్యాలకు చెందిన ఆ ఇద్దరి మధ్య బంధం ఎక్కడివరకూ వెళ్లింది? జీవితంలో ఇంకా స్థిరపడని ఆదిత్య ప్రేమ, పెళ్లి విషయంలో ఎలాంటి నిర్ణయాల్ని తీసుకున్నాడు? పెళ్లి చేసుకోవాలన్న తల్లిదండ్రుల ఒత్తిడికి కదలి తలొంచిందా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.



రివ్యూ

### ఎలా ఉందంటే..

నవతరం ఆధునిక జీవన శైలిని, వాళ్ల మధ్య బంధాల్ని, గందరగోళాల్ని, కుటుంబాల నుంచి, సమాజం నుంచి ఎదుర్కొంటున్న ఒత్తిళ్లని ఆవిష్కరించిన కథ ఇది. దీన్ని కథ అనడం కంటే కూడా ఓ అమ్మాయి, ఓ అబ్బాయి ప్రయాణం అని చెప్పొచ్చు. చదువుల కోసమని వెళ్లిన ఇద్దరి జీవితాన్ని దర్శకుడు తనదైన కోణంలో తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశాడు. ఆ జంటలో ప్రేక్షకులు తమని తాము చూసుకునేలా కొన్ని సన్నివేశాలు సినిమాలో ఉన్నాయి. అయితే వాళ్లు తీసుకునే నిర్ణయాలకూ, వాళ్లలో కనిపించే గందరగోళాలకూ అందరూ కనెక్ట్ అవ్వడం మాత్రం కష్టం. దర్శకుడు దీన్నొక ప్రేమకథగానో లేదంటే, సహజీవనానికి సంబంధించిన కథలాగో కాకుండా, ఓ జంటకు ఎదురైన వాస్తవ పరిస్థితుల్లాగా మలిచారు. దాంతో సగటు సినిమా కథల్లో ఉండే భిన్న పార్శ్వాలు కానీ, ఆసక్తిని రేకెత్తించే విరామం, సుఖాంతమైన ముగింపు కానీ ఈ సినిమాలో కనిపించవు. తెరపై కనిపించే ప్రధాన జంట ప్రయాణంతో మమేకమై సినిమా చూస్తేనే సంతృప్తి లభిస్తుంది తప్ప, దీన్నొక కథలా చూడటం మొదలు పెడితే మాత్రం చాలావరకూ సాగదీత వ్యవహారమే. అలాగని ఈ కథలో దర్శకుడు ప్రస్తావించిన అంశాలు తక్కువేమీ కాదు. సమాజంలోని కులాల పట్టింపుల దగ్గర్నుంచి, అమ్మాయిలు శారీరకంగా, సామాజికంగా ఎదుర్కొనే సమస్యలు, అబ్బాయిలు ఎదుర్కొంటున్న ఒత్తిళ్ల వరకూ చాలానే ఉన్నాయి. వాటన్నిటినీ దర్శకుడు పైపైనే స్పృశిస్తూ ఆలోచింపజేశారు కానీ, మరీ లోతుగా వెళ్లలేదు.

‘90ం – ఎ మిడిల్ క్లాస్ బయోపిక్’ ప్రపంచం నుంచే ఈ కథ మొదలవుతుంది. లెక్కల మాస్టర్ చంద్రశేఖర్ ఇల్లు, ఆ మధ్య తరగతి కష్టాల్ని పరిచయం చేస్తూనే ఆదిత్య కథలోకి తీసుకెళుతుందీ సినిమా. దర్శకుడు కావాలను కున్న ఆదిత్యని చీవాట్లు పెట్టే తండ్రి, మరోవైపు ప్రోత్సహిస్తున్నట్టుగా కనిపించే స్నేహితులతో సరదా సరదాగా సాగుతుంది. ఆదిత్య లండన్‌లో దిగాక మరింత సందడి మొదలవుతుంది. నాయకానాయికల పరిచయం, తొలి రోజే ఒకే గదిని పంచుకోవడం, ఆ గదిని తనకిచ్చిన స్నేహితుడు చూసి ఆశ్చర్యపోవడంలాంటి సన్నివేశాలు, సంభాషణలు మంచి హాస్యం పంచుతాయి. ఊళ్లో ఉన్న స్నేహితుడితో కథానాయకుడు మాట్లాడిన ప్రతిసారీ నవ్వులు పండుతాయి. ప్రథమార్ధంలో అమ్మాయిలకు సొంత ఇంటి నుంచే ఎదురవుతున్న ఒత్తిళ్లని అడ్రస్ చేయగా, ద్వితీయార్ధంలో అబ్బాయిల 24 ఏళ్లు, అమ్మాయిల 24 ఏళ్లు ఒకటి కాదంటూ కుర్రాళ్ల సంఘర్షణనీ ప్రస్తావించిన తీరు సినిమాకి ప్రధానబలం. తొలి అర్ధభాగంలో సినిమాలో ఎక్కువగా నవ్వులు పండగా, మలిభాగంలో భావోద్వేగాల మోతాదు ఎక్కువ. నాయకానాయికల ప్రేమప్రయాణం, కథానాయకుడు తన తల్లిదండ్రులు, స్నేహితుడితో సంభాషించడం మినహా మరో అంశం సినిమాలో ఉండదు.

# మహిళలే తాళి ఎందుకు ధరించాలి?

ఫస్ట్ మూవీ సొంతంతో సూపర్ సక్సెస్ అందుకున్న హీరోయిన్ నమిత... ఆ తర్వాత స్టార్ హీరోస్ సరసన నటించారు. పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె... వివాహ సంప్రదాయాలు, మహిళలపై సమాజంలో మోపుతున్న బాధ్యతలు, వివక్షల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అసలు పురుషులకు లేని నిబంధనలు మహిళలకే ఎందుకని ప్రశ్నించారు నమిత. ‘ఆడవాళ్లే ఎందుకు బొట్టు పెట్టుకోవాలి? మహిళలే తాళి ఎందుకు ధరించాలి? పురుషులకు లేని రూల్స్ మహిళలకే ఎందుకు?’ అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే, భర్త దీర్ఘాయుష్షు కోసం మహిళలు వరలక్ష్మి వ్రతం చేసే విధానంపైనా నమిత రియాక్ట్ అయ్యారు. నా భర్త సురక్షితంగా దీర్ఘాయుష్షుతో ఉండాలని నేను ఉపవాసం ఉంటాను. కానీ, నా భార్య క్షేమం కోసం భర్త కనీసం ఏడాదిలో ఒక్క రోజైనా కేటాయించాలనే రూల్ ఉందా? సమాజం ఎందుకు అలాంటివి క్రియేట్ చేయలేదు. కట్టు, బొట్టూ విషయంలో అన్నీ రూల్స్ మహిళలకే ఎందుకు? మహిళలు తాళి ధరించాలని ఏ గ్రంథాల్లోనూ లేదు. ఇవన్నీ సమాజం సృష్టించనవే. ఎందులోనూ ఇలాంటి నిబంధనలు లేవు.’ అంటూ చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ‘సొంతం’ సినిమాతో టాలీవుడ్?లోకి ఎంట్రీ ఇచ్చిన నమిత తనదైన అందం, నటనతో మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత విక్టరీ వెంకటేశ్‌తో జెమినీ చేశారు. రవితేజ, బాలకృష్ణ, శ్రీకాంత్ వంటి స్టార్స్‌తో కలిసి నటించారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ మూవీస్ చేశారు. 2017లో పెళ్లి తర్వాత సినిమాలకు దూరమయ్యారు. చివరగా 2020లో మియా అనే తమిళ మూవీలో నటించారు. రీసెంట్‌గా సోషల్ మీడియాలో యాక్టివ్ అవుతున్నారు. మళ్లీ ఆమె మూవీస్‌లో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే, దీనిపై నమిత అఫీషియల్‌గా రియాక్ట్ కాలేదు.



## సవాలు చేసే పాత్రలతో ప్రయోగాలు చేయాలనుకుంటున్నా

**రకుల్ ప్రీత్ సింగ్**

విభిన్న చిత్రాలతో దూసుకుపోతున్న నటి రకుల్ ప్రీత్ సింగ్.. ప్రస్తుతం నితీష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న రెండు భాగాల భారీ చిత్రం ‘రామాయణం’లో శూర్పణఖ పాత్రలో నటిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా, సాయి పల్లవి సీతగా, కాజల్ మండోదరిగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా మొదటి భాగం అంతర్జాతీయంగా నవంబర్ 6, 2026న విడుదల కానుండగా, భారత్‌లో మాత్రం దీపావళి పండుగ కానుకగా 8న థియేటర్లలోకి రానుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ ప్రీత్ సింగ్ తన మనసులో ఉన్న కోరికను బయటపెట్టారు. ఇప్పటివరకు తాను టచ్ చేయని కొన్ని ప్రత్యేకమైన పాత్రలను చేయాలని ఉందని చెప్పారు. తాను ఇప్పటివరకు ఎప్పుడూ ఒక పూర్తి స్థాయి హృదయాలను హత్తుకునే, కన్నీళ్లు పెట్టించే రొమాంటిక్ లవ్ స్టోరీ చేయలేదని, అలాంటి ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించాలని ఉందని అన్నారు. అలాగే, ఇప్పటివరకు ఎలాంటి చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ ఫిలింస్ లేదా హర్రర్ జోనర్‌లో కూడా నటించలేదని, ఆయా రంగాలను కూడా నటించాలనుకుంటున్నట్లు వెల్లడించారు. ఇక నుంచి సినిమాలను ఎన్నుకునే విషయంలో తన పద్ధతిని పూర్తిగా మార్చుకోనున్నట్లు రకుల్ స్పష్టం చేశారు. సినిమా ఎంత పెద్దది, ఏ జానర్ అనేది ఇప్పుడు తనకు ముఖ్యం కాదని, తనకు నటనకు పూర్తిస్థాయిలో అవకాశం ఇచ్చే బలమైన పాత్రలే కావాలని ఆమె తెలిపారు. తనను నటిగా లోపలి నుంచి సవాల్ చేసే, పూర్తిగా ఉత్తేజపరిచే రోల్స్ చేయడమే ప్రస్తుతం తన కెరీర్ ప్రధాన లక్ష్యమని ఆమె తేల్చిచెప్పారు.



Edited,Printed, Published and Owned by DHANDYALA RAVI KUMAR, Printed at Gayathri Printers - ID : PRESS/2025/125/00007278, Address : Plot no: 69 to 75, 4th Line, IDA, Khanapuram, Khammam - 507002.Telangana. EDITOR: DHANDYALA RAVI KUMAR. RNI NO: APTEL/2008/26868. Ph: 9848156178, mail: organ.today@gmail.com , website : www.organnews.in